# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 263 శుక్రవారం 19 ఏప్రిల్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## తెలంగాణకు బీజేపీ ఏం ఇచ్చిందో చెప్పాలి

- బీజేపీకి రూ.500 కోట్లు ఇచ్చినందుకే శరత్ చంద్రారెడ్డికి బెయిల్
- బాండ్ల విషయంలో బీజేపీ సమర్థించుకుంటున్న తీరు గర్హనీయం
- అవినీతి డబ్బు పార్టీలకు వస్తే అది నీతివంతంగా మారిపోతుందా?
- తెలంగాణ ప్రయోజనాలకు బీజేపీ సహకరించలేదు.
- రాముడి పేరు మీద రాజకీయం చేస్తున్నారు
- మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్

బీజేపీకి ఐదు వందల కోట్లు ఇచ్చినందుకే అరెస్టయిన అరబిందో డైరెక్టర్ పెనక శరత్ చంద్రారెడ్డికి బెయిల్ మంజూరైందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాండ్ల విషయంలో బీజేపీ సమర్థించుకుంటున్న తీరు గర్హనీయమన్నారు. అవినీతి డబ్బు పార్టీలకు వస్తే అది నీతివంతంగా మారిపోతుందా? అని ప్రశ్నించారు. కరీంనగర్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. తెలంగాణ ప్రయోజనాలకు బీజేపీ సహకరించలేదన్నారు. తెలంగాణకు బీజేపీ ఏం ఇచ్చిందో చెప్పాలని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. -మిగతా3లో



## సంపన్నుల గుప్పిట్లో దేశ సంపద కేంద్రీకరణ

- మన రైతులు సాయం కోసం అరుస్తున్నారు
- యువత ఉద్యోగాల కోసం పాకులాడుతున్నారు
- ఈ పరిస్థితిల్లో మనం సూపర్ పవర్ కాగలమా
- భారత్ వైవిధ్యతను కాంగ్రెస్, యూడీఎఫ్ ఆమోదిస్తాయి
- తాము భిన్న భాషలను, భిన్న సంస్కృతులను, భిన్న చరిత్రను గౌరవిస్తాం
- కాంగ్రెస్ నేత రాహుల్

# రాష్ట్రంలో భవిష్యత్ బీఆర్ఎస్‌దే

- 104 సీట్లున్న బీఆర్ఎస్‌ను పడగొట్టేందుకు ప్రయత్నం..!
- 64 సీట్లున్న కాంగ్రెస్‌ను బీజేపీ బతకనిస్తుందా..? : కేసీఆర్
- రాబోయే ఎన్నికల్లో గెలుపు కూడా మనదే
- గట్టిగా పోరాడితే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయి
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలు బాధపడుతున్నారు
- ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు
- లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయం గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది
- కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది




హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 104 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే కూల్చేందుకు బీజేపీ యత్నించింది. 64 మందే ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీని బతకనిస్తుందా..? అని కేసీఆర్ అన్నారు. రాష్ట్రంలో భవిష్యత్ బీఆర్ఎస్‌దే.. రాబోయే ఎన్నికల్లో గెలుపు కూడా మనదే అని కేసీఆర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేసీఆర్ తెలిపారు. గట్టిగా పోరాడితే లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు వస్తాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలు బాధపడుతున్నారు. అధికారం ఉందని కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తే ఇక్కడంతా బీజేపీ కథ నడుస్తోందని ఓ నాయకుడు తనతో వాపోయాడు. 20 మంది ఎమ్మెల్యేలను తీసుకొని రావాలా సార్ అని ఓ సీనియర్ కీలక నేత తనను సంప్రదించాడు. -మిగతా3లో

## రాహుల్ గాంధీకి ధైర్యం లేదు

- అక్కడ ఓటమి చవిచూసిన తరువాత కేరళకు వలస వెళ్లారని
- పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు వామపక్షాలు, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయి
- సీఏఏ చట్టం వల్ల ఎవరి పౌరసత్వం ప్రభావితం కాబోదు
- రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



# అభ్యర్థులు ఇవి పాటించాల్సిందే

- ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చు...
- 24లోగా ప్రింట్ అందించాలి: వికాస్‌రాజ్
- నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను జాగ్రత్తగా నింపాలన్న ఈసీ
- ఒక్కో అభ్యర్థి మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చునని వెల్లడి
- నామినేషన్ వేసేటప్పుడు ఐదు ఫొటోలు ఇవ్వవలసి ఉంటుందని వెల్లడి
- ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయొచ్చు
- పార్లమెంట్ ఎన్నికలపై గట్టి నిఘా ఉంచింది
- ఎన్నికల విధులకు 204 అంతర్రాష్ట్ర పోలీసులు, 444 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 160 కేంద్ర సంస్థల బలగాలు..
- తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

హైదరాబాద్:

లోక్‌సభ ఎన్నికలు, సికింద్రాబాద్ కంటోన్మెట్ ఉప ఎన్నిక నామినేషన్లపై ఎన్నికల సంఘం కీలక సూచనలు చేసింది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మీడియాకు పలు కీలక విషయాలను వెల్లడించారు. నేడు(గురువారం) నుంచి నామినేషన్లు ప్రారంభం అయ్యాయని.. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయొచ్చని తెలిపారు. నామినేషన్ ఫామ్, అఫిడవిట్‌లో అన్ని వివరాలను పూర్తి చేయాలని సూచించారు. నామినేషన్ పేపర్ల దాఖలు సమయంలో ఒకసారి ఆర్వో ఆఫీస్‌లోకి వచ్చిన తర్వాత బయటకు వెళ్లటానికి వీలు లేదని -మిగతా3లో



# సౌత్‌లో బీజేపీకి 15 సీట్లే

- దక్షిణాదిలో బీజేపీ ప్రభావం ఉండదు
- దక్షిణ భారతదేశంలో పట్టు కోసం కష్టపడుతుంది
- ఈ ప్రాంతంలోని 130 లోక్‌సభ స్థానాల్లో 15 కంటే తక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుంది
- ఇండియా కూటమి 115 - 120 మధ్య కైవసం చేసుకుంటుంది
- బీజేపీ ఓడించే ప్రయత్నంలో ఇది కీలకంగా మారుతుంది
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోస్యం



తిరువనంతపురం,

లోక్ సభ ఎన్నికల సమరం తారస్థాయికి చేరింది.. ప్రధాన పార్టీలన్నీ ప్రచారంలో దూసుకెళ్తున్నాయి. మూడోసారి అధికారం కోసం బీజేపీ, ఎలాగైనా పట్టు సాధించాలని కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఈ తరుణంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేరళలో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్న -మిగతా3లో

## ఓటుకు నోటు కేసు విచారణ మరోసారి వాయిదా



- ఈ కేసులో ఫైల్ చేసేందుకు తగిన సమయం కోరిన తెలంగాణ తరఫున న్యాయవాది
- సెలవుల తర్వాత విచారణ జరపాలి చంద్రబాబు తరపు న్యాయవాది
- తదుపరి విచారణ జూలై 24కి కోర్టు వాయిదా
- చార్జిషీట్‌లో చంద్రబాబు పేరును 22 సార్లు ఏసీబీ ప్రస్తావన
- 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ఎర చూపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు చంద్రబాబు ప్రయత్నం

న్యూఢిల్లీ

మళ్లీ వాయిదాలు ఇవ్వం.. ఇదే చివరి అవకాశం అని ఓటుకు నోటు కేసు విచారణలో చంద్రబాబుకు, తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కేసు ప్రారంభం కాగానే విచారణ వాయిదా వేయాలని చంద్రబాబు, తెలంగాణ ప్రభుత్వ న్యాయవాదులు కోరడంతో కేసు విచారణ జూలై 24కి -మిగతా3లో

# తొలిదశ పోలింగ్‌కు సర్వం సిద్ధం



**న్యూఢిల్లీ :** సార్వత్రిక ఎన్నికల తొలిదశ పోలింగ్ శుక్రవారం ప్రారంభం కానుంది. అందుకు కేంద్ర ఎన్నికల సంఘం స్వరం సిద్ధం చేసినట్లు ప్రకటించింది. ఈ తొలి దశ పోలింగ్‌లో 16.63 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపింది. అందులో 8.4 కోట్ల మంది పురుషులు కాగా, 8.23 కోట్ల మంది స్త్రీలు ఉన్నారని వివరించింది. అయితే 35.67 లక్షల మంది తొలిసారి తమ ఓటు హక్కు వినియోగించనున్నారని పేర్కొంది. ఈ దశలో మొత్తం 1.87 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు విశదీకరించింది. ఈ తొలి దశలో పోలింగ్ ప్రక్రియ కోసం 18 లక్షల మంది సిబ్బంది సేవల వినియోగించుకొంటున్నట్లు తెలిపింది. ఈ దశలో మొత్తం 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుందంది. అందులో 1,625 మంది అభ్యర్థులు బరిలో నిలిచినట్లు స్పష్టం చేసింది. వారిలో 1,491 మంది పురుషులు కాగా 134 మంది మహిళలు ఉన్నట్లు వివరించింది. ఇక ఈ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం 41 హెలికాప్టర్లు, 8 ప్రత్యేక రైళ్లు, సుమారు లక్ష వాహనాలు వినియోగిస్తున్నట్లు తెలిపింది. ఈ తొలి దశ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా నిర్వహించేందుకు షటిష్టమైన భద్రత చర్యలు చేపట్టినట్లు వివరించింది. అందుకోసం కేంద్ర బలగాలను మోహరిస్తున్నట్లు స్పష్టం చేసింది. 50 శాతం కంటే అధికంగా పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ చేయడం తోపాటు అన్ని పోలింగ్ స్టేషన్‌లలో మైక్రో అబ్జర్వర్‌లను నియామించానట్లు తెలిపింది. ఈ దశ పోలింగ్ కోసం మొత్తం 361 పరిశీలకులను నియమించామని చెప్పింది. అలాగే 127 మంది సాధారణ పరిశీలకులు, 67 మంది పోలీసు పరిశీలకులు, 167 మంది వ్యయ పరిశీలకులను నియమించినట్లు ఈసీ ప్రకటించింది. ఇక 4,627 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 5,208 స్టాటిస్టిక్స్ సర్వైలెన్స్ టీమ్‌లు, 2,028 వీడియో సర్వైలెన్స్ టీమ్‌లు, 1,255 వీడియో వ్యూయింగ్ టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు ఈసీ వివరించింది.


ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను కఠినంగా నియంత్రిస్తున్నట్లు ప్రకటించింది. ఆ క్రమంలో వేగంగా స్పందించేందుకు 24 గంటలూ ఈ బృందాలు నిఘా ఉంచుతుయని తెలిపింది. 1,374 అంతర్ రాష్ట్ర, 162 అంతర్జాతీయ సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీల కోసం ప్రత్యేక బృందాలు నియమించామని వివరించింది. మద్యం, మాదకద్రవ్యాలు, నగదు, ఉచితాల అక్రమ ప్రవాహ నివారణ కోసమే ఈ భద్రత చర్యలు చేపట్టిన ఈసీ విశదీకరించింది. అలాగే సముద్ర, వాయు మార్గాల్లోపై కూడా గట్టి నిఘా ఉంచామని తెలిపింది. 85 ఏళ్ళు దాటిన 14.14 లక్షల మంది వృద్ధులు, 13.89 లక్షల మంది వికలాంగులు.. వారికి సౌకర్యం ఉన్న చోట ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల సంఘం వివరించింది. 102 లోకసభ నియోజకవర్గాల పరిధిలో అయిదువేలకుపైగా పోలింగ్ కేంద్రాల్లో పూర్తిగా మహిళా అధికారులే విధులు నిర్వహిస్తున్నారని చెప్పింది. సుమారు వెయ్యి పోలింగ్ కేంద్రాలను వికలాంగులు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ తొలి దశలో 102 లోకసభా నియోజకవర్గాలతో పాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లోని 92 అసెంబ్లీ స్థానాలకు సైతం ఎన్నికలు జరగుతున్నాయంది. ఇక 102 స్థానాల్లో 73 జనరల్, 11 ఎస్టీ, 18 ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయని ఎన్నికల సంఘం వివరించింది.

# ఓటర్లు వీవీప్యాట్ స్లిప్‌లు పొందవచ్చా?



**న్యూఢిల్లీ:** లోక్‌సభతోపాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల ప్రక్రియలో పవిత్రత ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది. దేశంలో ఎన్నికలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగేలా అనుసరించే చర్యలను వివరించాలని ఈసీ కోరింది. 'ఇది ఎన్నికల ప్రక్రియ. పవిత్రంగా ఉండాలి. ఓటర్లు ఆశించినది జరగడం లేదని ఎవరూ భయాందోళన చెందకుండా చూసుకోవాలి' అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం పేర్కొంది. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం) ఓట్లతో వీవీప్యాట్ సిస్టమ్ ద్వారా రూపొందించిన పేపర్ స్లిప్‌లను క్రాస్ వెరిఫికేషన్ చేయాలంటూ దాఖలైన పిటిషన్లను కోర్టు విచారణ జరిపింది. ఈసీ తరపున సీనియర్ న్యాయవాది మణిందర్‌సింగ్, పిటిషనర్లలో ఒకరి తరపున అడ్వకేట్ నిజాంపాషా మాట్లాడుతూ.. ఓటరు ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్ స్లిప్ తీసుకోవడానికి అనుమతించాలని కోరారు. అయితే అలాంటి ప్రక్రియ ఓటరు గోప్యతను ప్రభావితం చేయదా అని జస్టిస్ ఖన్నా ప్రశ్నించారు. ఇది ఓటర్ గోప్యతను, ఓటరు హక్కులను భంగం కలిగించదని పాషా బదులిచ్చారు. అనంతరం మరో పిటిషనర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. %ఎవూూ% మెషీన్‌లోని లైట్ ఎల్లప్పుడూ ఆన్‌లో ఉండాలని కోరారు. ప్రస్తుతం ఈ లైట్ అది ఏడు సెకన్ల పాటు ఆన్‌లో ఉంటుందని తెలిపారు. ఈ సమయంలో ఒకవేళ పేపర్ స్లిప్ అందించడం వీలు కాకపోతే కనీసం ఎల్లవేళలా లైట్ వెలుగుతూనే ఉండేలా చూడాలని కోరారు. దీనివల్ల ఓటర్ స్లిప్ కటింగ్, బాక్స్‌లో పడిపోవడం చూడగలుగుతాడని చెప్పారు. ఇది వారి గోప్యతకు అడ్డు రాదని చెప్పారు. ఈ సందర్భంగా ఇటీవల కేరళలో జరిగిన మాక్ పోల్ గురించి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కాసర్‌గోడ్‌లో జరిగిన మాక్ ఓటింగ్‌లో బీజేపీకి అదనంగా ఓట్లు వచ్చాయని కోర్టుకు తెలిపారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఈ వ్యవహారాన్ని పరిశీలించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అనంతరం ఆ నివేదిక పూర్తి అవాస్తవమని ఈసీ వెల్లడించింది. పారదర్శక ఓటింగ్ నిర్వహణ కోసం ఎలాంటి విధానాలను పాటిస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. దీంతో ఎన్నికల సంఘం తమ ప్రక్రియను న్యాయస్థానానికి వివరించింది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది.

# వారే దాడి చేసి వారే ఆరోపణలు చేస్తున్నారు



ముర్షిదాబాద్ ఘటన ముందస్తు ప్రణాళికతో జరిగిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ( %మీుఎుీు దీుఅవతీయవవ% )మండిపడ్డారు. ఈ ఘటనకు బీజేపీ నేతలే కారణమని ఆరోపించారు. రాయ్‌గంజ్ లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె సంచలన కామెంట్లు చేశారు. రామనవమి ఊరేగింపుపై బీజేపీ నేతలే దాడి చేశారని అన్నారు. ఆయుధాలతో రామనవమి ఊరేగింపు చేసే అనుమతి ఎవరిచ్చారని నిలదీశారు. ఈ ఘటనలో 19 మంది గాయపడ్డారన్నారు. ఘటన జరగడానికి ముందురోజే ముర్షిదాబాద్ డీఐజీను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఆయన స్థానంలో కమిషన్ జాయింట్ కమిషనర్ గా విధులు నిర్వహిస్తున్న సయ్యద్ వకార్ రజాను నియమించారని వివరించారు. బీజేపీ హింసను ప్రేరేపించిందని సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రామనవమి సందర్భంగా జరిగిన దాడి అందరికీ తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులకూ గాయాలయ్యాయి. ఒక మతానికి చెందిన వ్యక్తులపై దాడి జరిగింది. కానీ టీఎంసీనే హింసకు పాల్పడిందని బీజేపీ ఆరోపించింది." అని మమతా బెనర్జీ చెప్పుకొచ్చారు. పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత్ మజుందార్ రామనవమి ఊరేగింపుపై టీఎంసీ వ్యక్తులు దాడి చేశారని ఆరోపించారు. ప్రజలను రెచ్చగొట్టేందుకు సీఎం మమతా బెనర్జీ ప్రయత్నించారని ఫైర్ అయ్యారు. దీనిపై ఎన్ఐఏ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ముర్షిదాబాద్ జిల్లాలో రామ నవమి ఊరేగింపుపై జరిగిన దాడిలో నలుగురికి గాయాలయ్యాయి. శక్తిపూర్ రామ్ నవమి ఉత్సవ్ కమిటీ నిర్వహించిన ఊరేగింపు ముర్షిదాబాద్‌లోని శక్తిపూర్ హైస్కూల్ వద్ద నుంచి వెళ్తున్న సమయంలో దాడి జరిగింది. ఆందోళనకారులు రాళ్లు రువ్వినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై బెంగాల్ వ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సీఎం మమత అండతో హిందువులపై దాడులు జరుగుతున్నాయని మండిపడుతున్నారు.

## భారీ వర్షం..
## నిలిచిన విమానాలు

ప్రపంచంలోనే రద్దీగా ఉండే ఎయిర్‌పోర్ట్‌ల్లో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఒకటి. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తడంతో భారత్ నుంచి దుబాయ్ వెళ్లే విమానాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాంతో ఎయిర్ ఇండియా, ఇండిగో తమ సర్వీసులను రద్దు చేసినట్లు ప్రకటించాయి. ఢిల్లీ విమానాశ్రయంలో దుబాయ్‌కి వెళ్లే పది విమానాలు, దుబాయ్ నుంచి వచ్చే తొమ్మిది విమానాలను రద్దు చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. భారత్‌లోని వివిధ నగరాల నుంచి ఎయిరిండియా దుబాయ్‌కి వారానికి 72 విమానాలను నడుపుతోంది. 'రాబోయే కొద్ది రోజుల్లోనే పూర్తి స్థాయిలో విమానాలను నడిపేలా చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం బాధిత ప్రయాణికులకు వసతి కల్పించడానికి కృషిచేస్తున్నాం. 16, 17 తేదీల్లో ప్రయాణాలకోసం టికెట్ బుక్‌చేసినవారు ఒకసారి తేదీ మార్చుకునేందుకు అవకాశం కల్పించనున్నాం. దాంతో వారు తమ గమ్యస్థానాలు చేరేలా ఏర్పాటు చేస్తున్నాం'అని ఒక ప్రతినిధి చెప్పారు.

# ఎన్నికల 'కురుక్షేత్రం'.. మూటలు మోసిన కుబేరుడు!



ఎన్నికల ప్రచార వేడి పతాక స్థాయికి చేరుకుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ- ఎన్‌డీఏ, ప్రతిపక్షాల ఉమ్మడి కూటమి ఇండియా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులను ఆకట్టుకోవడానికి రకరకాల ఫీట్లు చేస్తున్నారు. హర్యానాలోని కురుక్షేత్ర లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా అపర కుబేరుడు, జిందాల్ స్టీల్స్ ఛైర్మన్ నవీన్ జిందాల్ పోటీ చేస్తున్నారు. మొన్నటి వరకు ఆయన కాంగ్రెస్‌లో కొనసాగా రారు. 2004, 2009 ఎన్నికల్లో కురుక్షేత్ర నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. కొద్దిరోజుల కిందటే కాషాయ కండువా కప్పుకొన్న నవీన్ జిందాల్ అదే కురుక్షేత్ర నుంచి బీజేపీ టికెట్‌తో రంగంలో దిగారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నవీన్ జిందాల్.. స్థానిక మార్కెట్ యార్డులో మూటలు మోయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 50 కేజీల గోధుమ మూటను ఎత్తుకుని లారీలోకి లోడ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయనే స్వయంగా తన 'ఎక్స్' (ట్విటర్) ఖాతాలో షేర్ చేశారు. హర్యానాలోని మొత్తం 10 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అన్ని లోక్‌సభ నియోజకవర్గాలకు కూడా ఆరో విడతలో అంటే మే 25వ తేదీన పోలింగ్ జరగనుంది. 4వ తేదీన ఓట్లను లెక్కిస్తారు. ఈ రాష్ట్రంలో క్లీన్ స్వీప్ చేయడానికి అటు ఎన్‌డీఏ, ఇటు ప్రతిపక్ష కూటమి పట్టుదలతో ఉన్నాయి. దీనికి అనుగుణంగా ప్రచార వ్యూహాలను రూపొందించుకుంటున్నాయి.

## సంపన్నుల గుప్పిట్లో దేశ సంపద కేంద్రీకరణ



దేశంలో కేవలం 22 మంది సంపన్నుల చేతుల్లో 70 కోట్ల మంది మన దేశ ప్రజల ఆస్తులకు సమానమైన సంపద పోగుపడిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే మనం సూపర్ పవర్ కావడం గురించి ఎలా మాట్లాడతామని ప్రశ్నించారు. కేరళలోని కొట్టాయంలో గురువారం జరిగిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడుతూ మన రైతులు సాయం కోసం అరుస్తున్నారని, యువత ఉద్యోగాల కోసం పాకులాడుతున్నారని, ఈ పరిస్థితిల్లో మనం సూపర్ పవర్ కాగలమా అని మోదీ సర్కార్‌ను నిలదీశారు. ఇక దేశ ప్రజలపై ఒకే చరిత్ర, ఒకే జాతి, ఒకే భాషను రుద్దాలని బీజేపీ కోరుకుంటోందని రాహుల్ గాంధీ అంతకుముందు దుయ్యబట్టారు. కేరళలోని కన్నూర్‌లో ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించారు. భారత్ వైవిధ్యతను కాంగ్రెస్, యూడీఎఫ్ ఆమోదిస్తాయని, తాము భిన్న భాషలను, భిన్న సంస్కృతులను, భిన్న చరిత్రను గౌరవిస్తామని చెప్పారు. దేశ ప్రజల భిన్నమైన భావాలను గుర్తెరిగి అంగీకరిస్తామని అన్నారు. ఉదాహరణకు కేరళ నుంచి మళయాళాన్ని తొలగిస్తే రాష్ట్రంలోని మహిళ తన పిల్లలకు ఈ భూమి గొప్పతనం గురించి ఎలా వివరించగలదని రాహుల్ ప్రశ్నించారు. అందుకే భిన్న భాషలు, సంస్కృతులు, చరిత్రను తాము ఆమోదిస్తామని వివరించారు. ఇందుకు విరుద్ధంగా కాషాయ పార్టీ భిన్న మతాలు, భాషలు, సంస్కృతుల మధ్య చిచ్చు రేపి రాజకీయ లబ్ధికి పాకులాడుతోందని విమర్శించారు.

## రాహుల్ గాంధీకి ధైర్యం లేదు



**ఢిల్లీ:** కాంగ్రెస్ అగ్రనేత 'రాహుల్ గాంధీ' అమేథీ నుంచి పోటీ చేస్తారనే వార్తలు పెద్దగా వినిపించాయి. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఇప్పటికి కూడా కాంగ్రెస్ తరపున అమేథీలో పోటీ చేసే అభ్యర్థి ఎవరనేది స్పష్టం కాలేదు. ప్రియాంక గాంధీ భర్త 'రాబర్ట్ వాద్రా' పోటీ చేయనున్నట్లు వార్తలు వెలుగులోకి వస్తున్నాయి. దీనిపైన కూడా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. 2019లో అమేథీ లోక్‌సభ స్థానం నుంచి ఓటమి పాలైన రాహుల్ గాంధీకి ఈసారి అక్కడి నుంచి పోటీ చేసే ధైర్యం లేదని బీజేపీ సీనియర్ నేత రాజ్‌నాథ్ సింగ్ గురువారం కీలక వ్యాఖ్యలు చేశారు. అక్కడ ఓటమి చవిచూసిన తరువాత కేరళకు వలస వెళ్లారని సింగ్ చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు వామపక్షాలు, కాంగ్రెస్‌లు ప్రయత్నిస్తున్నాయని రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సీఏఏ చట్టం వల్ల ఎవరి పౌరసత్వం ప్రభావితం కాబోదని సీనియర్ బీజేపీ నాయకుడు హామీ ఇచ్చారు. అంతరిక్ష రంగంలో దేశం సాధించిన విజయాలు మరియు భారతదేశపు మొట్టమొదటి మానవ అంతరిక్షయాన కార్యక్రమం అయిన గగన్‌యాన్ వంటి వివిధ రాబోయే ప్రాజెక్టులను కూడా ఆయన ప్రస్తావించారు. అనిల్ కె ఆంటోనీని ప్రశంసిస్తూ.. అతనికి ఓటు వేయాలని ప్రజలను కోరారు. కేరళలో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 26న జరగనుండగా, జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## జైల్లో కేజ్రీవాల్ కావాలనే అవి తింటున్నారు

**కోర్టులో స్పష్టం చేసిన ఈడీ**

**షుగర్ లెవల్స్ పడిపోతున్నాయి**

**తనిఖీ చేసేందుకు వారానికి మూడుసార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన రెగ్యులర్ డాక్టర్‌ను సంప్రదించేందుకు అనుమతి కావాలని కోరుతూ కోర్టులో దాఖలు**


**ఉద్దేశపూర్వకంగా మామిడిపండ్లు, స్వీట్లు తింటున్నారని, చక్కెరతో కూడిన టీ తాగుతున్నారు**

**వైద్యపరమైన కారణాలను చూపుతూ బెయిల్ పొందాలంకునుటున్నారు**




**ఢిల్లీ:** లిక్కర్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేసింది. మార్చి 21న అరెస్ట్ అయిన తరువాత మార్చి 28వ తేదీ వరకు అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ సిటీ కోర్టు స్పెషల్ జడ్జి కావేరీ బవేజా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కేజ్రీవాల్ తీహార్ జైలులో ఉన్నారు. ఇటీవల షుగర్ లెవల్స్ పడిపోతున్నాయని.. క్రమం తప్పకుండా తనిఖీ చేసేందుకు వారానికి మూడుసార్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన రెగ్యులర్ డాక్టర్‌ను సంప్రదించేందుకు అనుమతి కావాలని కోరుతూ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగా మామిడిపండ్లు, స్వీట్లు తింటున్నారని, చక్కెరతో కూడిన టీ తాగుతున్నారని ఈడీ గురువారం ఢిల్లీ కోర్టుకు తెలిపింది. ఉద్దేశ్యపూర్వకంగానే స్వీట్స్ తిని షుగర్ లెవల్స్ పెంచుకుంటున్నారు. షుగర్ లెవెల్స్ పెరిగితే వైద్యపరమైన కారణాలను చూపుతూ బెయిల్ పొందాలంకునుటున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పేర్కొంది. ఇవన్నీ కేవలం ఆరోపణలు మాత్రమే అని కేజ్రీవాల్ తరపు న్యాయవాది వివేక్ జైన్ ఈడీ సమర్పణల మీద అభ్యంతరం వ్యక్తం చేశారు.

## నా భార్యకు ఏమైనా జరిగితే వదలిపెట్టను
## ఇమ్రాన్ ఖాన్ వార్నింగ్



**ఇస్లామాబాద్:** తన భార్య జైలుపాలు కావడానికి ఆర్మీ చీఫ్ జనరల్ ఆసీమ్ మునీర్ కారమంటూ మాజీ ప్రధాని, పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్( పీటీఐ) చీఫ్ ఇమ్రాన్ ఖాన్ ఆరోపించారు. తన భార్య బుష్రా బీబీ జైలు శిక్ష పడినందుకు ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ బాధ్యత వహించాలన్నారు. అవినీతి కేసుకు సంబంధించి బీబీ బుష్రా జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఆమె గృహ నిర్బంధంలో ఉన్నారు. అడియాలా జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఇమ్రాన్ ఖాన్ మీడియాతో మాట్లాడిన వీడియోను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'నా భార్య బుష్రాకు జైలు శిక్ష పడటంలో ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ స్వయంగా జోక్యం చేసుకున్నారు. కోర్టులో న్యాయమూర్తిపై అసిమ్ మునీర్ ఒత్తిడి తెచ్చారు. నా భార్యకు ఏదైనా జరిగితే.. అసిమ్‌ను వదిలిపెట్టను. నేను బతికి ఉన్నంతవరకు అసిమ్‌ను అస్సలు వదిలేయను. అసిమ్ చేసిన చట్టవ్యతిరేక చర్యలన్నీ బయటపెడతాను. ..పాకిస్తాన్‌లో ఆటవిక రాజ్యంలో కొనసాగుతోంది. అడవి(పాకిస్తాన్) రాజు(నవాజ్ షరీఫ్) తల్చుకుంటే అన్ని కేసులు మాఫీ చేయబడుతాయి. లేదంటే ఐదు రోజుల్లో మూడు కేసులు బనాయిస్తారు. శిక్ష కూడా పడుతుంది. ఆటవిక రాజ్యంలో పెట్టుబడలు రావు. పెట్టుబడుల పెట్టడానికి సౌదీ అరేబియా ముందురావటం మంచిదే. కానీ, చట్టబద్ధ కల్పించరు' అని ఇమ్రాన్ మండిపడ్డారు.

# రాష్ట్రంలో భవిష్యత్ బీఆర్ఎస్‌దే

-మొదటి పేజీ తరువాయి

ఇప్పుడే వద్దని వారించానని కేసీఆర్ తెలిపారు. కాంగ్రెస్‌లో టీమ్ వర్క్ లేదు.. స్థిరత్వం లేదు. ఇప్పటి వరకు 8 లోక్‌సభ సీట్లలో గెలుస్తామని సర్వేలు చెబుతున్నాయి. మరో మూడు స్థానాల్లో విజయావకాశాలు ఉన్నాయని కేసీఆర్ స్పష్టం చేశారు.

**ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు..**

లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయం గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏ రాజకీయ గందరగోళం జరిగినా బీఆర్ఎస్‌కే మేలు జరుగుతుంది. ఉద్యమకాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు. బస్సు యాత్ర రూట్ మ్యాప్ ఇవాళ ఖరారవుతుంది. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది.. రానున్న రోజులు మనవే. పార్లమెంట్‌లో మన గళం వినిపించాల్సిన అవసరం ఉంది. కొందరు నేతలు పార్టీని వీడి వెళ్లినంత మాత్రానా బీఆర్ఎస్‌కు నష్టం ఏమీ లేదు అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**పోస్టు కార్డు ఉద్యమం ఉధృతం చేయాలి..**

రైతు సమస్యలు అజెండాగా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలి. రైతు సమస్యలపై పోస్టుకార్డు ఉద్యమం ఉధృతం చేయాలి. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో లక్ష పోస్టుకార్డులు రాయాలి. రైతుల కల్లాల కాడికి వెళ్లి రూ. 500 బోనస్‌పై ప్రభుత్వాన్ని నిలదీయాలి. ప్రభుత్వ హామీలను కాంగ్రెస్ పార్టీకి గుర్తు చేయాలి. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉంది. దాన్ని అనుకూలంగా మలుచుకోవాలి అని కేసీఆర్ సూచించారు.

**22 నుంచి రోడ్డు షోలు..**

బస్సు యాత్రం చేద్దాం.. జనం నుంచి మంచి స్పందన వస్తోందని కేసీఆర్ తెలిపారు. ఈ నెల 22 నుంచి రోడ్డు షోలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని రెండు, మూడు అసెంబ్లీ ఏరియాల్లో రోడ్‌షోలు



ఉంటాయన్నారు. రోజుకు రెండు, మూడు రోడ్‌షోలు ఉంటాయన్నారు. ఉదయం సమయంలో రైతుల వద్దకు వెళ్లాలని నిర్ణయించారు. సాయంత్రం వేళ రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించనున్నారు. వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ సెంటర్లలో భారీ బహిరంగ సభలు నిర్వహించనున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు.

**రైతు సమస్యలు అజెండాగా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలి.**

రాబోయే రోజుల్లో ఉద్యమ కాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ పాల్గొని మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయం గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఏ రాజకీయ గందరగోళం జరిగినా బీఆర్ఎస్‌కే మేలు జరుగుతుంది. ఉద్యమకాలం నాటి కేసీఆర్‌ను మళ్లీ చూస్తారు. బస్సు యాత్ర రూట్ మ్యాప్ ఇవాళ ఖరారవుతుంది. కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ప్రారంభమైంది.. రానున్న రోజులు మనవే. పార్లమెంట్‌లో మన గళం వినిపించాల్సిన అవసరం ఉంది. రైతు సమస్యలు అజెండాగా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలి. కొందరు నేతలు పార్టీని వీడి వెళ్లినంత మాత్రానా బీఆర్ఎస్‌కు నష్టం ఏమీ లేదు అని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి అధినేత కేసీఆర్ సరికొత్త పంథా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఎండిన పంట పొలాలను పరిశీలించడంతో పాటు రోడ్డు షోల్లో పాల్గొనాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఉదయం 11 గంటల వరకు పొలం బాట.. సాయంత్రం నుండి ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గంలో 2-3 చోట్ల రోడ్డు షోలు, కార్నర్ మీటింగ్స్ నిర్వహించనున్నట్లు సమాచారం. సిద్దిపేట, వరంగల్‌లో లక్ష మందితో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

**కవిత అరెస్టుపై కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు**

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ముమ్మాటికీ అక్రమం అని పార్టీ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే కవితను అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి కూల్చేందుకు బీఎల్ సంతోష్ ప్రయత్నించాడని కేసీఆర్ తెలిపారు. బీఎల్ సంతోష్‌పై కేసు నమోదు చేసి ఆయనకు నోటీసులు పంపామని కేసీఆర్ గుర్తు చేశారు. బీజేపీ కేంద్ర కార్యాలయానికి రాష్ట్ర పోలీసులు వెళ్లారని తెలిపారు. ఈ క్రమంలోనే దుర్మార్గుడైన మోదీ.. బీఆర్ఎస్‌పై కక్ష కట్టారు. కవితపై ఎలాంటి కేసు లేదు.. కక్ష కట్టి అరెస్టు చేశారు. అందుకే కవితను కుట్రపూరితంగా మనీలాండరింగ్ కేసులో ఇరికించారని కేసీఆర్ స్పష్టం చేశారు.

# అభ్యర్థులు ఇవి పాటించాల్సిందే

-మొదటి పేజీ తరువాయి

ఆదేశించారు. అభ్యర్థి ఎక్కడ నామినేషన్ వేయాలో అక్కడే వేయాలని.. ఒక్క అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్ వేసే అవకాశం ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థి డిపాజిట్ ఫీజు రూ.25 వేలు చెల్లిచాలన్నారు. షెడ్యూల్డ్ తరగతుల వారికి ఫీజులో 15శాతం తగ్గింపు ఉంటుందని వెల్లడించారు. రాజకీయ పార్టీలు ఫామ్ A,B లు సీఈఓ ఆఫీస్, ఆర్వో ఆఫీస్‌లో ఇవ్వాలని సూచించారు.

నామినేషన్ వేసే అభ్యర్థి రీసెంట్ ఫొటోలు ఇవ్వాలని సూచించారు. అభ్యర్థి ఖచ్చితంగా క్రిమినల్ హిస్టరీ పబ్లిష్ చేయాలని ఆదేశించారు. ప్రతి అభ్యర్థి నామినేషన్ వేసే ముందు రోజు కొత్త బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి ఎన్నికల ఖర్చు అకౌంట్‌లో చూపించాల్సిందేనని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో ఓపెన్ చేసిన బ్యాంక్ అకౌంట్ ఈ ఎన్నికల్లో ఉపయోగించడానికి వీలు లేదని సూచించారు. నేడు(గురువారం) 48 నామినేషన్లు రాగా... 42 మంది అభ్యర్థులు దాఖలు చేశారని తెలిపారు.

ఈవీఎంలు, వీవీప్యాట్లు సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. 19 ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ఒక నోడల్ అధికారి ఈసీఐ నియమించిందని వివరించారు. ఈ ఎన్నికల్లో ఎంపీ స్థానాల పరిధిల్లోని 51 అసెంబ్లీ స్థానాల్లో భారీగా నగదు ఖర్చు అయినట్లుగా గుర్తించామని అన్నారు. ఎన్నికల





సిబ్బంది పార్లమెంట్ ఎన్నికలపై గట్టి నిఘా ఉంచిందని చెప్పారు. ఎన్నికల విధులకు 204 అంతర్రాష్ట్ర పోలీసులు, 444 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 160 కేంద్ర సంస్థల బలగాలు.. ఇప్పటికే మరో 60 కంపెనీల బలగాలు తెలంగాణలో గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రతీ జిల్లాలో 16మంది నోడల్ అధికారులు ఉన్నారని... 2లక్షల 94వేల మంది పోలింగ్ స్టాఫ్ ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు తమకు పలువురు అభ్యర్థులపై 2వేల ఫిర్యాదులు వచ్చాయని.. ఎంసీసీవైయిలైజైషన్‌లో 4వేల FIRలు నమోదయ్యాయని చెప్పారు. వేసవి కావడంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. మెడికల్ టీమ్స్ కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. తెలంగాణలో మొత్తం 3కోట్ల 31లక్షల మంది ఓటర్లు ఉండగా మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే ఈ ఎంపీ ఎన్నికలకు మహిళా ఓట్లు మరింతగా పెరిగాయని వివరించారు. 18 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు కలిగిన వారు దాదాపు 10 లక్షల మంది ఉన్నారని సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు.


ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా కూడా నామినేషన్ దాఖలు చేయవచ్చునని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... నామినేషన్ పత్రాలు, అఫిడవిట్లను జాగ్రత్తగా నింపాలన్నారు. ఒక్కో అభ్యర్థి మూడు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చునని తెలిపారు. నామినేషన్ వేసేటప్పుడు ఐదు ఫొటోలు ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఆన్ లైన్ ద్వారా నామినేషన్ దాఖలు చేసిన వారు ఈ నెల 24వ తేదీలోగా ప్రింట్ తీసుకొని అందించాలని స్పష్టం చేశారు. నాలుగో విడత ఎన్నికలకు తొలిరోజు నామినేషన్ ప్రక్రియ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. మల్కాజ్‌గిరి లోక్ సభ స్థానానికి ఈటల రాజేందర్, మహబూబ్ నగర్ నుంచి డీకే అరుణ, మెదక్ నుంచి రఘునందన్ రావు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు ముగ్గురు బీజేపీ అభ్యర్థులు. నాగర్ కర్నూల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, మెదక్ లోక్ సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

# దూరమౌతున్న కేడర్... నిలబెట్టుకొనేదలా...

హైదరాబాద్/వరంగల్

బీఆర్ఎస్ పార్టీకి పునర్ వైభవం తీసుకొస్తామని అధిష్టానం పదేపదే చెబుతున్నా ఆ దిశగా అడుగు ముందుకు పడటం లేదు. పార్టీకి గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పూర్తిస్థాయి కమిటీలు లేవు.. జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించినా కేడర్‌కు శిక్షణ కార్యక్రమాలు చేపట్ట లేదు. దీంతో పార్టీ కార్యాలయాలన్నీ నిరూపయోగంగానే మారాయని పార్టీ నేతలే ఆరోపిస్తున్నారు. కేసీఆర్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ పార్టీ నిర్మాణంపై దృష్టిసారించలేదు. గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయలేదు. దీంతో అధికారం కోల్పోగానే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నేతలంతా ఇతర పార్టీల్లోకి వలస వెళ్తున్నారు. దీంతో గ్రామస్థాయిలో పార్టీ ఖాళీ అవుతుంది. దీనిని నివారించేందుకు గ్రామస్థాయి నుంచి కమిటీలు, అనుబంధ కమిటీలు వేసి, శిక్షణ కార్యక్రమాలు చేపడితేనే పార్టీ బలోపేతంతో పాటు పునర్ నిర్మాణం జరిగి పార్టీ మనుగడ ఉంటుందని, లేకుంటే కష్టమేనని పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అయితే పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ పటిష్టతకు ఎలాంటి చర్యలు తీసుకుంటారనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది బీఆర్ఎస్ పార్టీని 2001లో స్థాపించారు. నాటి నుంచి 2014వరకు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాన్ని కొనసాగించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చింది. కానీ ఏనాడూ కూడా పార్టీ కేడర్ కు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదని పార్టీ నేతలే పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చినవారు... పార్టీలో ఉన్నవారితో కలిసి గ్రామస్థాయిలో బలంగా ఉన్నామని చెప్పారు. రెండేళ్ల క్రితం పార్టీ సభ్యత్వాలు సైతం చేసి అత్యధిక సభ్యత్వాలు ఉన్నపార్టీ బీఆర్ఎస్ అని పార్టీ అధినేత కేసీఆర్ పేర్కొన్నారు.కానీ పార్టీ పటిష్టతపై మాత్రం దృష్టిసారించలేదు. గ్రామశాఖ అధ్యక్షుడిని మాత్రమే నియమించి పూర్తి స్థాయి కమిటీలతో పాటు అనుబంధ కమిటీలను సైతం నియమించలేదని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అన్ని గ్రామాల్లో కమిటీలు వేయాలని, సోషల్ మీడియా కమిటీని సైతం నియమించి యాక్టీవ్ గా పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ ఆదిశగా చర్యలు చేపట్టలేదని సమాచారం. అదే విధంగా మండల, నియోజకవర్గ కమిటీలు కూడా లేవు. అదే విధంగా జిల్లా కమిటీ అధ్యక్షులను మాత్రమే నియమించారు. పూర్తి జిల్లా కమిటీలతో పాటు అనుబంధసంఘాల కమిటీలు వేయలేదు. గతంలో వేసిన కమిటీలే ఇంకా కొనసాగుతున్నాయి. మరోవైపు గ్రామస్థాయి నుంచి పార్టీలో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్యేకు అనుకూలంగా, మొదటి నుంచి పనిచేస్తున్న వారు మరోవర్గంగా ఉన్నారు. ఎమ్మెల్యే అనుకూలవర్గానికే గ్రామకమిటీ అధ్యక్షుడిగా నియమించడంతో మిగతావారంతా గుర్రుగా ఉండటంతో కొన్ని కమిటీలను వేయలేదని సమాచారం. ఇదే పరిస్థితి నియోజకవర్గ, జిల్లా స్థాయిలో కొనసాగుతోంది. ఆ గ్రూపులే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణమైందని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నూతన రాష్ట్ర కమిటీ కూర్పుపై కసరత్తు ప్రారంభించినప్పటికీ ఎవరికైనా కమిటీలో అవకాశం రాకపోతే వ్యతిరేకత వస్తుందని భావించి వెనక్కి తగ్గినట్లు సమాచారం. ప్రస్తుతం రాష్ట్ర కమిటీలో 67 మంది సభ్యులతో జంబో కమిటీ ఉంది. ఆ కమిటీలో ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు కీలక సీనియర్ నేతలకు మాత్రమే అవకాశం కల్పించారు. పార్టీ అధ్యక్షుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడితో సహా 20 మంది ప్రధాన కార్యదర్శులు, 33 మంది కార్యదర్శులు, 12 మంది సంయుక్త కార్యదర్శులున్నారు. ఆ కమిటీలో సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన కేకే పార్టీ మారారు. సీనియర్ నేతలు మంద జగన్నాథం, కడియం శ్రీహరి, మధన్ రెడ్డి, పి.రాములు, బీబీపాటిల్, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి ఇలా పలువురు రాష్ట్రకమిటీలో ఉండగా ప్రస్తుతం వారంతా పార్టీ మారారు. వీరి పోస్టులు ఖాళీ అయ్యాయి. నూతనంగా కమిటీని వేస్తే తమకు చోటుదక్కుతుందని పలువురు ఆశిస్తున్నారు. కానీ ఆదిశగా చర్యలు చేపడుతారో... లేదో చూడాలి.పార్టీ కేడర్‌ను ఎప్పటికప్పుడు యాక్టీవ్ చేసేందుకు పార్టీ అధిష్టానం అన్ని జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించింది. నియోజకవర్గాల వారీగా నేతలకు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని పేర్కొంది. నిర్మించిన కార్యాలయాలు నిరూపయోగంగా మారాయి. శిక్షణ మాటలకే పరిమితం అయింది. పార్టీ కేడర్‌కు మార్గనిర్దేశం చేసే నాయకుడే కరువయ్యారని, పార్టీ ఏం చేపడుతుందో అర్థం కావడం లేదని, మనోధైర్యం నింపే పార్టీ నేత కరువయ్యారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఓటుకు నోటు కేసు విచారణ మరోసారి వాయిదా



-మొదటి పేజీ తరువాయి

కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో ఫైల్ చేసేందుకు తగిన సమయం కావాలని తెలంగాణ తరపున న్యాయవాది కోరగా, నెలవుల తర్వాత విచారణ జరపాలని చంద్రబాబు తరఫు న్యాయవాది కోరారు. ఈ కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని, దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని పిటిషన్ దాఖలైంది. చార్జిషీట్‌లో చంద్రబాబు పేరును 22 సార్లు ఏసీబీ ప్రస్తావించింది. అయినా చంద్రబాబు పేరు నిందితుడిగా తెలంగాణ ఏసీబీ చేర్చకపోవడాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్‌పై జస్టిస్ సుందరేష్, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం విచారణ జరిపింది.

2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బు ఎర చూపి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు చంద్రబాబు ప్రయత్నించారు. ఈ వ్యవహారాన్ని తెలంగాణ ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌ను టీడీపీ అభ్యర్థికి ఓటు వేయాలని చంద్రబాబు ప్రలోభ పెట్టారు. ఫోన్లో మాట్లాడిన ఆడియోను ఏసీబీ బయటపెట్టింది. "మనోళ్ల బ్రీఫ్డ్ మీ" వాయిస్ చంద్రబాబుదేనని ఫోరెన్సిక్ నిర్ధారించింది.

**ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబుకు శిక్ష తప్పదు: ఎమ్మెల్యే ఆర్కే**

కేసు విచారణ అనంతరం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి సాక్షి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, రేవంత్ రెడ్డి మరోసారి కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. కేసు వాయిదా వేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరిందని, ఇదే చివరి అవకాశమని, మళ్లీ వాయిదాలు ఇచ్చేదిలేదంటూ సుప్రీంకోర్టు జూలై 24కు కేసు వాయిదా వేసిందని వివరించారు. ఒక ఓటుకు ఐదు కోట్లు బేరం పెట్టుకున్న చంద్రబాబు ఆడియో బయటపడింది. 50 లక్షలు ఇస్తూ పట్టుబడ్డ వ్యక్తి రేవంత్ రెడ్డి. ప్రపంచమంతా చూస్తుండగానే డబ్బు ఇచ్చారు. అన్ని సాక్షాలు ఉన్న ఈ కేసు ముందుకు సాగకపోవడానికి కారణం వ్యవస్థలను మేనేజ్ చేయడమే. ఏడేళ్ల నుంచి కేసు ముందుకు నడవకుండా రకరకాల కారణాలతో సాగదీస్తున్నారు. సుప్రీంకోర్టు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసింది. రాబోయే రోజుల్లో చంద్రబాబుకు ఈ కేసులో శిక్ష తప్పదు" అని ఎమ్మెల్యే ఆర్కే చెప్పారు.

## తెలంగాణకు బీజేపీ ఏం ఇచ్చిందో చెప్పాలి



-మొదటి పేజీ తరువాయి

వేములవాడ, కొండగట్టు ప్రసాదం స్కీం కింద ఒక్క రూపాయి అయినా ఆయిన తీసుకు వచ్చారా అని ప్రశ్నించారు. రాముడి పేరు మీద రాజకీయం చేస్తున్నారని పొన్నం మండిపడ్డారు. రాముడిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదన్నారు. ఒకవేళ తాను రాముడి గురించి తప్పుగా ఏమైనా మాట్లాడినట్టు బీజేపీ ఎంపీ బండి సంజయ్ నిరూపిస్తే తాను సజీవ దహనానికి సైతం సిద్ధమన్నారు. తాము రాముడిని ఆరాధిస్తాం కానీ రాజకీయాలు చేయబోమని తెలిపారు. తెలంగాణలో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని పొన్నం వ్యాఖ్యానించారు.

## నిప్పుల కొలిమిని తలపిస్తున్న కోల్ బెల్ట్



మంచిర్యాల: సాధారణంగానే సింగరేణి ఏరియాలో ఉష్ణోగ్రత చాలా ఎక్కువగా ఉంటుంది.ఇక ఎండాకాలంలో ఈ ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. ప్రస్తుతం ఎండలు మరింత తీవ్రతరమయ్యాయి. భానుడు మంటలు మండిస్తున్నాడు. ఉదయం 8 గంటలకే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నారు. ఇక మధ్యాహ్న సమయంలో అయితే భగభగ మండిపోతున్నాడు. ఇక సాధారణ ప్రాంతాల్లోనే పరిస్థితి ఇలా ఉంటే కోల్‌బెల్ట్ ప్రాంతంలో ఎలా ఉంటుంది? ప్రస్తుత తరుణంలో కోల్ బెల్ట్ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. సింగరేణి ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరాయి. ఓపెన్ కాస్ట్ బొగ్గు గనుల్లో మరో రెండు, మూడు డిగ్రీలు అధికంగా ఉన్నాయి. భానుడి తాపానికి కార్మికులు విలవిల్లాడుతున్నారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో పని వేళలు మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

## సౌత్‌లో బీజేపీకి 15 సీట్లే

-మొదటి పేజీ తరువాయి




రేవంత్ రెడ్డి ఓ జాతీయ ఛానెల్ తో మాట్లాడుతూ.. దక్షిణాదిలో బీజేపీ ప్రభావం ఉండదంటూ పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దక్షిణ భారతదేశంలో పట్టు కోసం కష్టపడుతుందని, ఈ ప్రాంతంలోని 130 లోక్‌సభ స్థానాల్లో 15 కంటే తక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోస్యం చెప్పారు.2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు కేరళ.. తమిళనాడు, తెలంగాణ, ఏపీలో ఇలా అన్ని ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి బీజేపీ.. దక్షిణాది రాష్ట్రాలలో తన ఉనికిని విస్తరించేందుకు సర్వశక్తులు ఒడ్డింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా రంగంలోకి దిగి.. గత కొన్ని వారాల నుంచి ఆ రాష్ట్రాలలో వరుస పర్యటనలు చేశారు.ఈ క్రమంలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సౌత్ ఇండియాలోని 130 సీట్లలో ఇండియా కూటమి 115 - 120 మధ్య కైవసం చేసుకుంటుందని తాను ఆశిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ ఓడించే ప్రయత్నంలో ఇది కీలకంగా మారుతుందని తెలిపారు. దక్షిణాదిలో 130 సీట్లు ఉన్నాయి.. బీజేపీకి 12 నుంచి 15 వచ్చే అవకాశం ఉంది.. మిగతావన్నీ ఇండియా కూటమికే దక్కుతాయి.. అంటూ అని కేరళలోని అట్టింగల్‌లో కాంగ్రెస్‌కు చెందిన అదూర్ ప్రకాష్‌కు ప్రచారం చేస్తూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# సంపాదకీయం

## వికసిత్ భారత్ అంటే ఇదేనేమో!

భారతదేశం బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందనీ, త్వరలో ఐదు ట్రిలియన్ డాలర్లకు చేరుకొని ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటుందనీ, దేశంలో కుల రాజకీయాలు చేయొద్దని, మన దేశంలో ఉన్నది రెండే రెండు వర్గాలని ఒకటి పేదలు రెండవ వారు పేదలను ఉద్ధరించే వారని పదే పదే చెబుతున్నారు. అయితే దేశంలో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. సమాజం కులాల పరంగా, మతాల పరంగా విడిపోయి దేశంలో 28 కోట్ల మంది ప్రజలు అర్ధాకలితోనూ, 21 కోట్ల మంది అనారోగ్యాలతోనూ, కోట్లాదిమంది నిరుద్యోగంతోనో ఉన్నారని అనేక ఆర్థిక నివేదికలు తెలియజేస్తున్నాయి. మన ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం మహిళలు 80 శాతం మందికి రక్తహీనత, 30 శాతం మంది అవిద్యతో, 80 శాతం మంది స్త్రీలు ఎటువంటి నైపుణ్యాలు లేక అతి తక్కువ వేతనాలతో దేశంలో ఉన్నారు. ఇటీవలే అంతర్జాతీయ శ్రామిక సంస్థ నివేదిక ప్రకారం మన దేశంలో యువత 83 శాతం మంది ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే దేశంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఎంత దుర్భరంగా ఉన్నాయో బోధపడుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులు ఈ సదుపాయాలు ఎందుకు కల్పించలేక వాటిపై పెట్టుబడులు పెట్టలేకపోతున్నారో, తాము అధికారంలోకి వచ్చేందుకు ఉచిత పథకాలపై ఖర్చు చేస్తూ ప్రజలను ప్రలోభ పెడుతున్నారో తీసుకోవాల్సిన పరిస్థితి ఆసన్నమైనది. దేశంలో బ్రతుకుతెరువు లేక మన దేశ పౌరులు ప్రపంచ దేశాల్లో 3.7 కోట్ల మంది విదేశీ పౌరసత్వాన్ని తీసుకున్నారు. వీరందరూ ఉపాధి అవకాశాలు ఈ దేశంలో లేనందువలన వలస బాట పట్టిన వారే. ఈ వలస బాటలో మన దేశ కోటీశ్వరులు కూడా ఉన్నారు. 2013 -22 మధ్యకాలంలో 48,500 మంది కోటీశ్వరులు విదేశీ పౌరులుగా మారిపోయారు. మనదేశంలో నూతన ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వ రంగాలను ప్రైవేటీకరిస్తున్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వలన మన ఆర్థిక వ్యవస్థ స్వేచ్ఛా వాణిజ్య పోటీ మార్కెట్ నుంచి గుత్త పెట్టుబడిగా తర్వాత నేటి కార్పొరేటీకరణ వరకు ప్రభుత్వ మద్దతుతోనే కొనసాగుతూ పెట్టుబడిదారీ వ్యవస్థగా అభివృద్ధి చెందుతూ విస్తరిస్తూ ఉన్నది. ప్రపంచీకరణ తొలి రోజుల్లో (1991) భారత్‌లో పదిమంది కూడా లేని బిలినియర్ల సంఖ్య తాజా లెక్కల ప్రకారం 200కు చేరింది. ప్రభుత్వమంటే పెట్టుబడిదారీ వ్యవహారాలను చక్కబెట్టే యంత్రంగా మిగిలిపోవడం వల్లే నేడు దేశంలో పేదరికం, నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నాయి. వెనుకబడిన కులాలు ఈ అభివృద్ధిలో పాలు పంచుకో లేనందువలన పేదరికం, నిరుద్యోగం ప్రబలమైపోతున్నది. నేడు దేశంలో ఆదాయ అసమానతలు బ్రిటిష్ వలస పాలనలో కన్నా ఎక్కువగా ఉన్నాయని అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నివేదికలు తెలియజేస్తున్నాయి. దేశంలో పెరుగుతున్న జీడీపీ ఎవరి జేబుల్లోకి పోతున్నది. 2022 లో 22.6% జాతీయ ఆదాయం ఉన్నత ఆదాయ వర్గాల ఒకే ఒక్క శాతం దగ్గర ఉన్నది. 1951లో ఈ ఒక్క శాతం జనాభా దగ్గర ఉన్నది 11.5% మాత్రమే. 1980 నాటికి 6 శాతానికి తగ్గిపోయినది. ఇలా ఆదాయాలని లబ్ధి పొందిన వారెవరు. అదే విధంగా ఉన్నత ఆదాయ వర్గం 10 శాతం జనాభా చేతిలో 1951లో 36.7 శాతం కాగా 2022 నాటికి 57.7% పెరిగిపోయినది. ఇలా ఆదాయాలని దక్కించుకున్న వారు ఎవరు? ఉన్నత కులాలవారా? దీనికి భిన్నంగా 2022 లో 50 శాతం జనాభా చేతిలో జాతీయ ఆదాయం కేవలం 15 శాతం మాత్రమే ఉంది. అయితే 1951లో ఈ 50 శాతం జనాభా వాటా 20.6 గా ఉన్నది. ఇలా పేదలు నిరుపేదలుగా మారడం, మిలియనీర్లు బిలియనీర్లుగా మారడం మన దేశంలోనే జరుగుతున్నది. 2019లో మన ప్రధానమంత్రి మోడీ ప్రకారం దేశంలో రెండే రెండు కులాలు ఉన్నాయి. అవి పేదలు, రెండవది పేదలను అభివృద్ధి పరిచేవారు. అలా ఆనాడు అన్న ఆయన 2024 లో ఇప్పుడు దేశంలో నాలుగు కులాలు మాత్రమే ఉన్నాయి అవి ఒకటి స్త్రీలు, రెండు యువత, మూడు రైతులు, నాలుగు పేదలు అని అంటున్నారు. కులాల ద్వారా కులాల వలన కులాల చేత పాలన చేసే రాజకీయం వద్దంటున్నారు. పేదలను గుర్తించండి అని వారి అభివృద్ధికి పాటుపడాలని అంటున్నారు. దేశంలో ఎక్కువగా హింసకు గురవుతున్నది మహిళలే అని తద్వారా వారు ఆరోగ్యవంతమైన మానసిక స్థితి లేక నివాస సదుపాయాలు లేక నిరసించి పోతున్నారని అభిప్రాయపడ్డారు. పేదలు, పేదరికం ఈ దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయని వీరి అభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి జరుగుతుందని మన ప్రధానమంత్రి వాదన. ఆధునిక ప్రజాస్వామిక, లౌకిక మార్గాలలో భారతదేశాన్ని నిర్మించాలంటే కుల ఆధారిత హిందూ సమాజానికి, దాని సంస్కృతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం అవసరమని గ్రహించాలి. భారతదేశ సనాతన నాగరికత, సంస్కృతి కోటలు బీటలు పారందే సమ సమాజాన్ని నిర్మించలేం. పేదరికాన్ని నిర్మూలించలేం. 6400 కులాలు, ఆరు మతాలు, 1618 భాషలు, 29 రకాల పండుగలు ఉన్నటువంటి దేశంలో భిన్నత్వ కోణంలోనే కొన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని పేదరికం, నిరుద్యోగం, ఆదాయ అసమానతలను నిర్మూలించగలం.


# అలుపెరుగని పోరాట యోధుడు



భారత దేశంలో సర్దార్ లుగా పేరొందిన ప్రముఖులలో ఒకరు సర్దార్ వల్లభభాయి పటేల్. మరొకరు సర్దార్ గౌతు లచ్చన్న. ఒకరిది దేశస్థాయిలో, మరొకరిది రాష్ట్ర స్థాయిలో రాణించారు. సర్దార్ అంటే సేనాని. స్వాతంత్ర్యోద్యమ పోరాట వీరునిగా ఎన్నో ఉద్యమాలు నడిపిన కురువృద్ధుడు సర్దార్ గౌతు లచ్చన్న. జమీందారీ వర్గాల వ్యతిరేక పోరాట వీరునిగా ప్రజాహృదయాలలో లచ్చన్న స్థానం చెక్కు చెదరనిది. గౌతు లచ్చన్న (ఆగష్టు 16, 1909 – ఏప్రిల్ 19, 2006) సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలిచ్చిన కితాబే సర్దార్. సర్దార్ గౌతు లచ్చన్న, వి.వి.గిరి, నేతాజి సుభాష్ చంద్రబోస్, జయంతి ధర్మతేజ, మొదలగు అనేకమంది జాతీయ నాయకులతో కలిసి భారత దేశ స్వాతంత్ర్య పోరాటాలలో పాల్గొని, అనేక పర్యాయాలు జైలుకు వెళ్ళారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి మంత్రివర్గంలో మంత్రి పదవి నిర్వహించిన లచ్చన్న, మద్యపాన నిషేధం విషయంలో ప్రకాశం పంతులుతో విభేదించి, అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి, ప్రకాశం ప్రభుత్వ పతనానికి కారణభూతుడయ్యారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు మద్దతు ప్రకటించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకు నాటి ఉద్యమ నేత మర్రి చెన్నారెడ్డితో చేతులు కలిపారు.

తెలంగాణా రాష్ట్ర అవసరాన్ని, ఔచిత్యాన్ని వివరిస్తూ పుస్తకం వ్రాశాడు. ఇందిరాగాంధి అత్యవసర పరిస్థితి విధించినప్పుడు వ్యతిరేకించి, స్వేచ్ఛ కోసం పోరాడారు. చౌదరి చరణ్ సింగ్, జయప్రకాష్ నారాయణ, మసాని లతో కలిసి పనిచేశారు. తెలుగులో మంచి ఉపన్యాసకుడుగా, రాజాజి ఉపన్యాసాల అనువాదకుడిగా, చరిత్ర ముద్ర వేయించుకున్న బడుగువర్గ పోరాట యోధుడు లచ్చన్న. సర్దార్ గౌతు లచ్చన్న. ఉత్తర కోస్తా కళింగసీమలో ఉద్దానం ప్రాంతాన (నాటి గంజాం జిల్లా) సోంపేట తాలూకాలో బారువా అనే గ్రామంలో 1909 ఆగష్టు 16 వ తేదీన ఒక సాధారణ బీద గౌడ కుటుంబములో గౌతు చిట్టయ్య, రాజమ్మ దంపతులకు జన్మించారు. బారువాలో గల ప్రాథమిక పాఠశాలలో 1916లో చేరి, పాఠశాలలో 8 వ తరగతి వరకు చదివి, ప్రక్కనే ఉన్న మందసా రాజావారి హైస్కూల్లో 9 వ తరగతిలో చేరి, పరీక్ష తప్పాడు. శ్రీకాకుళంలో ఉన్నత పాఠశాలలో చేర్పించగా, అక్కడ జగన్నాథం పంతులుగారి ఇంటిలో ఉండి చదువు సాగించారు. ఆ స్కూల్లో డ్రిల్ మాష్టారు నేమాని నరసింహ మూర్తి శిక్షణలో జాతీయ భావాల్ని అలవర్చుకున్నారు. లచ్చన్నకు ఆనాటికి 21 సవంత్సరాలు. 1929-30 విద్యా సంవత్సరం మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపువిని విద్యకు స్వస్తి చెప్పి స్వాతంత్ర్యోద్యమంలో దూకారు. 1930 లో మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపినిచ్చారు. దీనికి ప్రభావితుడైన లచ్చన్న బారువా సమీపంలో ఉన్న సముద్రపు నీరుతో ఉప్పు తయారుచేసి ఆ డబ్బుతో ఆ ఉద్యమాన్ని నడిపారు. విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో పాల్గొని అందరూ చూస్తుండగానే తన విలువైన దుస్తులను అగ్నికి అహుతి చేశారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొంటున్నప్పుడు లచ్చన్నను అరెస్టు చేసి టెక్కలి, నరసన్నపేట సబ్ జైళ్లల్లో నలభై రోజులు ఉంచారు. కోర్టు తీర్పు మేరకు మరో నెల రోజుల శిక్షను అతను బరంపురం జైల్లో అనుభవించవలసి వచ్చింది. 1932 వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొంటున్న లచ్చన్నను రాజమండ్రి జైల్లో ఐదు మాసాలు ఉంచారు. అంటరానితనం నిర్మూలన. అంటరానితనం మీద కత్తి ఝుళిపించాడు లచ్చన్న. అతను నడిపిన హరిజన సేవా సంఘాలు, చేపట్టిన హరిజన రక్షణ యాత్రలు ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. బారువా గ్రామ వీధుల్లో యువజనులను వెంట వేసుకొని భజన గీతాలు పాడుతూ వెళుతుంటే గ్రామ మంతా దద్దరిల్లుతున్నట్లు కనిపించేది. సవర్ణులలో ఆశ్చర్యం, హరిజనులలో ఆశలు రేకెత్తించేవి. రాత్రి పాఠశాలలు నిర్వహించి బడుగు వర్గాల విద్యాభివృద్ధికి అతనెంతో కృషి చేశాడు. హరిజనులకు దేవాలయాలలో ప్రవేశం కలిగించారు. లచ్చన్న చేసిన ఆర్థిక సహాయంతో కుశాగ్రబుద్ధులైన ఎందరో హరిజన విద్యార్థులు ఉన్నత స్థానాల నలంకరించారు. ఆచార్య గోగినేని రంగాతో లచ్చన్న స్నేహం రాష్ట్ర రాజకీయాలలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. మహాత్మాగాంధీ, పండిట్ నెహ్రూ గురు శిష్య సంబంధం లాంటిదే రంగా- లచ్చన్నల సంబంధం. 1935లో రాష్ట్రంలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ శాఖ ఏర్పడినప్పుడు దానికి అతను సభ్యుడుగా ఎన్నికయ్యాడు. ఆ రోజుల్లో రైతు సంఘాలు కాంగ్రెస్ పార్టీలోని అంగాలే. 1939లో త్రిపురలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభ, కిసాన్ సభలను ఆంధ్రలోని పలాసాలో జరపాలని తీర్మానించారు. రాహుల్ సాంకృత్యాయన్ ఈ సభలకు అధ్యక్షత వహించారు. ఈ సభలు జయప్రదం కావడానికి ప్రధానకారకుడు లచ్చన్నే. దీనితో ఆయన పేరూ, ఆయన కార్యదీక్ష దేశమంతటా తెలిసింది. లచ్చన్న అనేక కిసాన్ ఉద్యమాలు నడిపి ఆ రోజుల్లో జమీందార్ల పక్కల్లో బల్లెంగా తయరైనారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం అతి ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి, ఆయనను పట్టి యిచ్చిన వారికి పదివేల రూపాయల బహుమతిని ప్రకటించింది. చివరకు ప్రభుత్వమే అతనిని బంధించి మూడేళ్ళు జైల్లో ఉంచి 1945 అక్టోబరులో విడుదల చేసింది. ఆనాటి నుంచి లచ్చన్న ఆంధ్ర అగ్రనాయకులలో ఒకరైనారు. 1947లో లచ్చన్న ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ కు రాష్ట్ర శాఖ అధ్యక్షులయ్యారు. 1950లో ఆచార్య గోగినేని రంగా కృషి కార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు అందులో లచ్చన్న ప్రధాన పాత్ర పోషించాడు. 1953 అక్టోబరు 1 న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రభుత్వం నుంచి ఆంధ్రులకు రావలసిన ఆస్తుల విభజనను పరిశీలించడానికై ఏర్పడిన ఆంధ్రసంఘంలో కాంగ్రెస్ నుంచి నీలం సంజీవరెడ్డి, ప్రజా పార్టీ నుంచి తెన్నేటి విశ్వనాథం, కృషి కార్ లోక్ పార్టీనుంచి లచ్చన్న సభ్యులు. ప్రకాశం పంతులు మంత్రివర్గంలో, బెజవాడ గోపాలరెడ్డి మంత్రివర్గం లోనూ, లచ్చన్న మంత్రిగా పనిచేశారు. 1961లో రాజాజీ ఏర్పాటు చేసిన స్వతంత్ర పార్టీకి ఆంధ్రప్రదేశ్ శాఖకు సర్దార్ గౌతు లచ్చన్న అధ్యక్షుడు. 1978లో లచ్చన్న ఆంధ్రప్రదేశ్ శాసనసభలో అధికార ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నాడు. పబ్లిక్ అక్కౌంట్స్ ఛైర్మన్ గా ఆ రోజుల్లో పనిచేశారు. కొంతకాలం బహుజన పార్టీలో పనిచేసిన లచ్చన్న ఆ తరువాత అన్ని రాజకీయ పార్టీలతో తెగతెంపులు చేసుకుని, పార్టీలకు అతీతంగా బడుగు వర్గాల సంక్షేమానికి కృషి చేస్తూ వచ్చారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 2006 ఏప్రిల్ 19 న కన్ను మూశారు.

# జీవపరిణామ సిద్ధాంత కర్త



డార్విన్ పేరును తలుచుకుంటే ఎవరికైనా వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయముపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు అయన. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏక కాలంలో రూపొందినట్లు ఎంతో కాలం నుండి నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి – అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుందని మొట్ట మొదటి సారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామ పరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (ఫిబ్రవరి 12, 1809 – ఏప్రిల్ 19, 1882) ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది.డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువులో రాణించలేదు. ఆయనను మంద బుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. ఆయన చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్యను చదవటం కోసం ఆయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తు మందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు ఆయన కలత చెంది వైద్య విద్యపై మనసు పెట్టి చదవలేక పోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్ర అధ్య అధ్యయనంలో చేరినా అక్కడా అదే పరిస్థితి. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి 'బీగల్' అనే ఓ నౌక కెప్టెన్ కు పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్లు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించ.లేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రో బయాలజీ, జెనెటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్‌ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో "డార్వినిజం" చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు.

డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరి పోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823- 1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివే. గతంలో వీటికి తలొక "పూర్వీకుడూ" ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ "ఆదిమ" శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగా, మరికొన్ని మాంసాహారులుగా రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఇన్నిరకాల ప్రాణులు "వాటంతట అవే" ఎలా ఉద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో పుట్టుకొచ్చిన మానవ జాతి క్రమంగా ఉత్తర దిశగానూ, తక్కిన ప్రాంతాలకీ విస్తరించిందని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఉష్ణోగ్రత దృష్ట్యా తొలి మానవులు నల్లని రంగులో ఉండి ఉంటారని అనుకోవచ్చు. ఉత్తరాన ఎండపొడ తక్కువగా పడే ప్రాంతాలకు వెళ్ళినవారి చర్మం తెల్లగా మారక తప్పలేదు. పూర్తిగా నల్లరంగులో ఉన్న ఒక మానవ సమూహం తెల్లగా మారి పోవడానికి 20 వేల సంవత్సరాలు సరిపోతాయని అంచనా. తక్కిన జంతువుల సంగతి ఎలా ఉన్నా, ఒక్క మనిషి జాతినే తీసుకుంటే, చర్మం రంగూ, ముఖ కవళికలూ అన్నీ మెల్ల మెల్లగా మారడానికి జీవపరిణామ ప్రక్రియలే కారణమని రుజువు అవుతోంది. సరిగ్గా ఆ సమయంలోనే ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే మరో శాస్త్రవేత్త కూడా డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్నే వెలువరించాడు. డార్విన్ కు ఉత్తరం కూడా రాసాడు. 1858 లో వీరిద్దరూ సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కూడా! 1859 లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన "ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్" పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునె అన్ని ప్రతులూ అమ్ముడు పోయి సరికొత్త రికార్డును సృష్టించింది. పరిణామ సిద్ధాంతం జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ.

ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థకమ జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిధ్యాలే తరాలు మారుతూ పోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. అయితే సృష్టి సిద్ధాంత వాదులు ఈయన వాదనను సమర్థించరు. అయితే బైబిల్ లో చెప్పినట్లు ఏడు రోజుల లోనే సమస్త సృష్టి, సకల జీవ జలాలు రూపొందించ బడినాయని చెబితే మాత్రం నమ్మడం కష్టం. చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంశలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ప్రభావితం చేసి అధునిక భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది. అయితే కొన్ని క్రైస్తవ, ఇస్లామిక్ దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పద మయ్యింది. సృష్టి వాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని ఇస్లామిక్ దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేదించారు. ఈ సిద్ధాంతం తప్పని, జీవ పరిణామక్రమం జరగలేదని వాదించే వారు కూడా ఉన్నారు. ఈయన 74 యేండ్ల వయస్సులో మృతి చెందాడు. సర్ ఐజాక్ న్యూటన్ సమాధి దగ్గరే ఆయన కూడా సమాధి చేయ బడింది. డార్విన్ లేకపోయినా ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్ధాంతం ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..


# స్థానిక వార్తలు

## తోట త్రిమూర్తులు మార్పు తప్పదా



**కాకినాడ :** సరిగ్గా నామినేషన్ల ఘట్టం ప్రారంభమయ్యే సమయానికి వైసీపీకి అనేక సమస్యలు చుట్టు ముడుతున్నాయి. అందులో ఒకటి మండపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అంశం. దళితుల శిరోముండనం కేసులో వైసీపీ ఎమ్మెల్సీ, మండపేట అభ్యర్థి తోట త్రిమూర్తులను దోషిగా న్యాయస్థానం తేల్చింది. శిక్ష కూడా విధించింది. అయితే ఆయన జైలుకు వెళ్లకుండా తాత్కలికంగా బెయిల్ లభించింది. శిక్షపై స్టే మాత్రం లభించలేదు. హైకోర్టులో అప్పీల్ చేసుకోవాల్సి ఉంది. సున్నితమైన దళితుల శిరోముండనం కేసులో శిక్ష పడటంతో ఆయనను అభ్యర్థిగా కొనసాగించాలా వద్ద అన్న అంశంపై వైసీపీ అధినేత చర్చిస్తున్నారు.తోట త్రిమూర్తులు అభ్యర్థిత్వాన్ని మార్చి అక్కడ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ను నిలబెడితే ఎలా ఉంటుందని పరిశీలిస్తున్నారు. గత ఎన్నికల్లో సుభాష్ చంద్రబోస్ పోటీ చేశారు. ఒక వేళ తోట త్రిమూర్తుల్ని కంటిన్యూ చేయిస్తే దళిత ఓట్లపై ఎఫెక్ట్ పడుతుందని భావిస్తున్నారట. ఈ వ్యవహారంపై టీడీపీ నుంచి విమర్శలు తీవ్రమయ్యాయి. తోటను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు కొన్ని దళిత సంఘాలు కూడా ఆగ్రహంతో ఉన్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీ తరపున షర్మిల దళితుల ఓట్లనే టార్గెట్ చేశారు. వైసీపీకి చెందిన పలువురు దళిత నేతల్ని పార్టీలో చేర్చుకుని టిక్కెట్లు ఇచ్చారు. వైఎస్ఆర్సీపికి దళితులు ప్రధాన మద్దతుదారులుగా ఉన్నారు. గత ఐదేళ్ల కాలంలో జరిగిన అనేక పరిణామాలు దళితుల్ని దూరం చేశాయన్న అభిప్రాయం ఉంది. ఈ క్రమంలో శిరోముండనం కేసులో దోషి తేలిన వ్యక్తినీ సమర్థిస్తూ టిక్కెట్ ఇస్తే మొదటికే మోసం వస్తుందని ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ఇప్పటికే దళితుడైన తన మాజీ డ్రైవర్ ను హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుకు వైసీపీలో ప్రాధాన్యం లభిస్తోంది. సస్పెండ్ చేసినట్లుగా ప్రకటన చేశారు కానీ.. ఆయన పార్టీ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రంపచోడవరం, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో గెలుపు బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు ప్రాధాన్యంపై ఇప్పటికే దళితుల్లో అసంతృప్తి ఉందన్న ప్రచారం జరుగుతోంది. ఇలాంటి సమయంలో తోట త్రిమూర్తుల్ని కూడా ప్రోత్సహిస్తే ఇంకా ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంని చెబుతున్నారు. అయితే జగన్మోహన్ రెడ్డి ఒక సారి టిక్కెట్ ప్రకటించిన తర్వాత వెనక్కి తగ్గరని.. అభ్యర్థి మార్చరని.. తోట త్రిమూర్తులు వర్గం నమ్మకంతో ఉంది. తామే పోటీ చేస్తున్నామని త్రిమూర్తులు కుమారుడు సోషల్ మీడియాలో ప్రకటించారు.

## జనసేనాని ఎందుకిలా...




**విజయవాడ :** జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు జనసైనికుల నుంచి సూటి ఎదురవుతున్న ప్రశ్న ఇది. ఒకవైపు తాను జూన్ 4వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తానని, ముఖ్యమంత్రిగా తొలిసంతకాన్ని వాలంటీర్ల వ్యవస్థను తిరిగి పునరుద్ధరించే ఫైలుపై పెడతానని వైసీపీ అధినేత జగన్ చెబుతున్నారు. అదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు కూడా తాను జూన్ 4వ తేదీన నాలుగువేల రూపాయల పింఛను పై సంతకం చేస్తానని, వాటిని ఇంటి వద్దకు అందించేలా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. కానీ అదే సమయంలో జనసైనికులు ఆశించినట్లు .. తొలి సంతకం మాట పవన్ నోటి నుంచి వినిపించకపోవడంతో వారు నిరాశకు గురవుతున్నారు. కేవలం బీఫారాలపై తొలి సంతకాలకే పరిమితయ్యేటట్లు కనిపిస్తుందన్న కామెంట్స్ వినపడుతున్నాయి ఆంధ్రప్రదేశ్ లో కూటమి ఏర్పడిన తర్వాత జనసేన పార్టీ అరవైకి పాగా స్థానాలను తీసుకుంటుందని భావించారు. అదే సమయంలో తనకంటూ ఒక వ్యూహమందని కూడా పవన్ చెబుతూ వస్తుండటంతో సీట్ల విషయంలో పవన్ తగ్గడని అందరూ భావించారు. ఫిఫ్టీ ఫిఫ్టీ గా ముఖ్యమంత్రి పదవిని అయినా పంచుకుంటారని పార్టీ నేతల నుంచి అభిమానుల వరకూ ఆశించారు. టీడీపీ అధినేత చంద్రబాబు తన అవసరానికి పొత్తు కుదుర్చుకోవడంతో జనసేనాని ఈసారి గట్టిగానే సీట్లను కోరతారని అనుకున్నారు. కానీ ఏమయిందో ఏమో.. తెలియదు కానీ.. మొదట 24.. ఆ తర్వాత 21.. స్థానాలకు జనసేన పోటీ చేసే స్థానాలు పడిపోయాయిఆ స్థానాల్లో కూడా అసలు సిసలైన జనసేన నేతలకు సీట్లు దక్కలేదు. టీడీపీ, వైసీపీ నుంచి వచ్చిన వారికే సీట్లు కేటాయించడంతో జనసైనికుల్లో ఒకరకమైన నిర్లిప్తత ఏర్పడింది. దీనికా మనం ఇంత కష్టపడేది? అన్న తరహాలో వారి మనోభావాలున్నాయి. తాము గత కొన్నేళ్లుగా కష్టపడి నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసినా చివరకు తమకు సీటు రాకపోవడంతో అనేక మంది నేతలు రాజీనామా బాట పడుతున్నారు. అసలే ఉన్నది కొద్దిమంది నేతలు. ఆ నేతలు కూడా పార్టీని వీడిపోయే పరిస్థితి నెలకొంది. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం, కైకలూరు, అవనిగడ్డ జనసేన నేతలు రాజీనామా బాట పట్టారు. తాము పార్టీ కోసం ఎందుకు ఇన్నాళ్లు కష్టపడ్డామని, గుర్తింపులేని చోట ఉండటమెందుకని వారు ప్రశ్నిస్తున్నారు.విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నేత పోతిన మహేష్ అయితే ఏకంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పైనే విమర్శలు చేశారు. తాను ఆస్తులు అమ్ముకుని జెండాను నియోజకవర్గంలో నిలబెడితే చివరకు తనను నమ్మించి మోసం చేశారంటూ ఆయన ఫైర్ అయ్యారు. చంద్రబాబు, బీజేపీ నేతలకు పట్టని రాష్ట్రాభివృద్ధి ఒక్క పవన్ కల్యాణ్ కే పట్టిందా? అని ప్రశ్నిస్తున్నారు. త్యాగాలు వాళ్లు చేయకుండా జనసేన నేతలనే చేయాలని చెప్పడం ఎంతవరకూ సబబని ఆయన నిలదీస్తున్నారు. ఇలా చాలా నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ కు జనసైనికుల నుంచి ప్రశ్నలే ఎదురవుతున్నాయి. మరి కొందరు నేతలు పార్టీని వదలి వెళుతున్నారు. ఈ ప్రశ్నలకు ఆయన నుంచి సమాధానం రాకపోయినా.. ఎన్నికలకు ముందే గాజు గ్లాసులో టీ ఒలికిపోయిందన్న కామెంట్స్ నెట్టింట వినబడుతున్నాయి.

## రహదారిని దిగ్బంధించిన మావోయిస్టులు

**దంతేవాడ :** ఛత్తీస్ గడ్ రాష్ట్రం దంతెవాడలో చిందనార్-తుమ్రిగుండ రహదారిని మావోయిస్టులు దిగ్బంధించారు. ఛింద్నార్ క్యాంపు నుంచి పహుర్నార్ చౌక్, ఛోటే కర్కా, చెర్పాల్, తుమ్రిగుండ వరకు పలు చోట్ల మావోయిస్టులు రాళ్లు, బ్యానర్ పోస్టర్లు వేసారు. రోడ్డును దిగ్బంధించారు. రోడ్డుపై రాళ్లు, నేమ్ ప్లేట్లతో దిగ్బంధం చేసారు. బర్సూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, చిద్నార్ సిఆర్పిఎఫ్ భద్రతా బలగాల బృందం రోడ్డును పునరుద్ధరించే పనిలో నిమగ్నం అయ్యారు.

# సండే.. నాన్ వెజ్ లవర్స్‌కు షాక్



**హైదరాబాద్ :** ఆదివారం వచ్చిందంటే ఇళ్లలో నాన్ వెజ్ వంటల ఘుమఘుమలాడుతుంటాయి. ఇక హైదరాబాద్ లో అయితే ఆదివారం చికెన్, మటన్ షాపుల ముందు రద్దీ కనిపిస్తుంది. వారం అంతా డ్యూటీలు, ఇతర పనులతో బిజీ బిజీగా ఉండే నగర వాసులు ఆదివారం... ఓ ముక్క, అలవాటుంటే సాయంత్రం ఓ చుక్క వేసుకుంటారు. దీంతో ముఖ్యంగా ఆదివారం నాన్ వెజ్ విక్రయాలు అధికంగా ఉంటాయి. కానీ హైదరాబాద్ వాసులకు ఓ చిన్న బ్యాడ్ న్యూస్... ఏంటంటే వచ్చే ఆదివారం(ఏప్రిల్ 21)న సిటీలో నాన్ వెజ్ దొరకదు. చికెన్, మటన్, ఇతర నాన్ వెజ్ విక్రయాలు ఉండవు. కారణంగా ఏంటంటే...మహావీర్ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని కబేళాలతో పాటు అన్ని మాంసం దుకాణాలను వచ్చే ఆదివారం మూసివేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. జీహె చ్ఎంసీ కమిషనర్ ఆదేశాలతో ఆదివారం మాంసం దుకా ణాలు మూతపడనున్నాయి. జైనులకు మహావీర్ జయంతి చాలా ముఖ్యమైన పండుగ.జైనులు జరుపుకునే పండుగలలో మహావీర్ జయంతి చాలా ముఖ్యమైనది. అహింసను ప్రబోధించిన జైన మత ప్రచారకుడు, వర్ధమాన మహావీరుడి జయంతిని ప్రతిసంవత్సరము చైత్ర మాసంలో ఘనంగా జరుపుకుంటారు. 36వ ఏట సన్యాసాన్ని స్వీకరించిన వర్ధమానుడు.. 12 ఏళ్ళ పాటు తపస్సు చేసి మహావీరుడుగా జైనమత ప్రచారకుడయ్యారు. అప్పటికే జైన మతానికి 23 మంది తీర్థంకరులుగా ఉన్నప్పటికీ మహావీరుడు బాధ్యతలు చేపట్టిన తర్వాతే ఆ మతానికి సంబంధించిన వివరాలు వెలుగు చూసినట్లుగా చెబుతారు. 32 ఏళ్ళ పాటు అహింసా ధర్మంతో మత ప్రచారం జరిపిన మహావీరుడు 72వ ఏట మరణించారు. జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని కబేళాలతో పాటు మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశించినట్లు జీహెచ్ఎంసీ రొనాల్డ్ రాస్ తెలిపారు. హైదరాబాద్ సిటీలో మాంసానికి ఉన్న డిమాండ్ మరే నగరంలోనూ ఉండని సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో ఉన్న జనాభాతో పాటు వేలాది సంఖ్యలో ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లు కూడా భారీ మొత్తం మాంసం కొనుగోలు చేస్తుంటాయి. ఆదివారం షాపుల మూసివేత కారణంగా వీరికి కాస్త నష్టం ఎక్కువగా ఉండనుంది. కానీ, ఈ ఉత్తర్వుల గురించి తెలిసిన వారు మాత్రం ముందు రోజే తాజా మాంసాన్ని కొనుగోలు చేసుకొని ఫ్రిడ్జ్ లో నిల్వ చేసుకొని ఆదివారాన్ని యథాతథంగా జరుపుకోనున్నారు. తిరిగి సోమవారం యథావిధిగా కబేళాలు తెరుచుకోవచ్చని కమిషనర్ చెప్పారు.హైదరాబాద్ లోనూ జైనుల సంఖ్య గణనీయంగా ఉండడంతో...మహావీర్ జయంతి నాడు నగరంలో మాంసం విక్రయాలపై ఆంక్షలు విధించింది జీహెచ్ఎంసీ. ఈ నిర్ణయానికి ప్రజలు సహకరించాలని కోరింది. నిబంధనలు అతిక్రమించి ఎవరైనా మాంసం షాపులు ఓపెన్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని జీహెచ్ఎంసీ కమిషనర్ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది ఈ ఉత్తర్వులను అమలు చేయడంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం యథా విధిగా కబేళాలు తెరుచుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# బస్టాండ్‌లో నిలువు దోపిడి




**కరీంనగర్ :** తెలంగాణలో హైదరాబాద్ తర్వాత రెండో అతిపెద్దది కరీంనగర్ బస్టాండ్ అని తెలిసిందే. మరి అలాంటి కరీంనగర్ బస్టాండ్లో ప్రయాణికుల నుంచి వ్యాపారస్తుల నిలువు దోపిడి సాగుతుందా...? అంటే అవునని వినిపిస్తోంది. కరీంనగర్ బస్టాండ్ మీదుగా రోజూ కొన్ని వందల బస్సులు వెళుతూ ఉంటాయి. నిత్యం వేలాదిమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు ప్రేమ్ నగర్ ఆర్టీసీ బస్టాండ్ కు చేరుకుంటారు. బస్సుల కోసం వేచి చూసే ఆ ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండులో కొనే నీళ్ల నుంచి ఆహార పదార్థాల వరకూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నారు. నాసిరకమైన తినుబండారాలను విక్రయిస్తూ ప్రయాణికుల ఆరోగ్యంతో సైతం ఆడుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇదేంటి అని ప్రశ్నిస్తే నాకు తెలియదు, ఓనర్‌ను అడగాలని షాపుల్లోని వారు చెబుతున్నారు. కరీంనగర్ బస్టాండ్ లోని దుకాణాల్లో అధిక వసూళ్లు, నాసిరకమైన అమ్మకాలపై ఏబీపీ దేశం స్పెషల్ స్టోరీ...కరీంనగర్ బస్టాండ్ లో మొత్తం 40 వరకు దుకాణాలు ఉండగా ప్రతిరోజూ సుమారు వందల బస్సులు వేల ట్రిప్పులు వేస్తుంటాయి. నిత్యం రెండు లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. ఈ బస్టాండ్ లోని దుకాణాలలో వాటర్ బాటిల్స్, సమోసాలు, మిర్చీలు, చిప్స్, బిస్కెట్ ప్యాకెట్లు ఇతర తిను బండారాలు సహా కూల్ డ్రింక్స్ విక్రయిస్తుంటారు. అసలే వేసవికాలం కావడంతో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికులు లైట్ స్నాక్స్ తీసుకుందామని తిను బండారాలు కొన్నా, దాహంగా ఉందని కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్ కొన్నా.. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. మరోవైపు నాసిరకమైన ఉత్పత్తులను విక్రయిస్తూనే ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొరిక్యల గ్రామానికి చెందిన ఓ ప్రయాణికుడు సిద్ధిపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో దాహం వేసి కరీంనగర్లోని బస్టాండ్ లో కూల్ డ్రింక్ తీసుకున్నాడు. కానీ ఎమ్మార్పీ కంటే పది రూపాయలు ఎక్కువ తీసుకుంటున్నారు. అదేంటి అని అడిగితే ఇక్కడ ఇలాగే విక్రయిస్తామని దుకాణదారుడు అన్నారని ప్రయాణికుడు తెలిపారు. మరో ప్రయాణికుడు కరీంనగర్ నుంచి హైదరాబాదుకు వెళ్లే తన స్నేహితులను బస్సు ఎక్కించేందుకు వచ్చాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బస్టాండ్ లోని ఓ షాపు వద్దకు వెళ్లి మూడు కూల్ డ్రింక్స్ తీసుకోగా ఒక్కో దానిపై పది రూపాయలు ఎక్కువ తీసుకున్నారని తెలిపారు. దీనిపై ప్రశ్నించేవారు లేరా ఎవరైనా అధికారులు చర్యలు తీసుకుంటే బావుంటుందని అన్నారు.కరీంనగర్ బస్టాండ్ లో జరుగుతున్న నిలువు దోపిడి, నాసిరకమైన వస్తువులు, పదార్థాల అమ్మకాలపై ఏబీపీ దేశం వివరణ కోరగా.. ఇక్కడ జరిగే అలాంటి వాటిపై తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. గతంలో కూడా నాణ్యత లేని పదార్థాలు విక్రయించడం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు జరపడంపై తమకు కంప్లైంట్ వస్తే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎవరైనా ప్రయాణికులు తమకు రాత పూర్వకంగా కంప్లైంట్ ఇస్తేనే చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాణ్యత విషయానికొస్తే.. ఆహార భద్రత శాఖ వారు ఈ విషయంపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కరీంనగర్ బస్టాండ్లో జరుగుతున్న నిలుదోపిడి, నాసిరకమైన వ్యాపారాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాలంటే వేచి చూడక తప్పదు.

# వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది




**హైదరాబాద్ :** వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. ప్రపంచ హెరిటేజ్ దినోత్సవ సందర్భంగా జిహెచ్ఎంసి ఆద్వర్యంలో గురువారం దారుల్ షిఫా నుండి ప్రారంభమైన హెరిటేజ్ వాక్ సాలార్ జాంగ్ మ్యూజియం మీదుగా ఉస్మానియా ఆసుపత్రి వద్ద ముగిసింది. హెరిటేజ్ వాక్ లో కమిషనర్ రోనాల్డ్ రోస్ తో పాటు జోనల్ కమిషనర్లు, హెచ్ ఓ డి లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి కమిషనర్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగరంలో ప్రాముఖ్యత గల వారసత్వ సంపదను కాపాడేందుకు విశేష కృషి చేస్తున్నట్లు, వారసత్వ సంపదను బావితరాల వారికి అందించాలనే సంకల్పంతో చార్మినార్ పెడెస్ట్రెయిన్ ప్రాజెక్టు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. జిహెచ్ఎంసి అధ్వర్యంలో 3 పురాతన భవనాలు పునర్నిర్మాణం, సుందరీకరణ కోసం రూ.18.33 కోట్ల వ్యయంతో మోజం జాహి మార్కెట్, మౌలాలి కామన్, క్లాక్ టవర్ పనులను పూర్తి చేయడం జరిగిందని, చార్మినార్ పెడేస్ట్రేయిన్ క్రింద చేపట్టిన వివిధ అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. చార్మినార్ చుట్టున్న ఆరు కమాన్ లను పున:నిర్మాణ, పునరుద్ధరణ పనులకోసం ప్రతిపాదించినట్లు కమిషనర్ పేర్కొన్నారు. ముర్గి చౌక్, సర్దార్ మహల్ పనులు కూడా చేపట్టి పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని అన్నారు. హెరిటేజ్ వాక్ లో 1908 లో మూసి వరదల సందర్భంగా నగరంలో చేపట్టే అభివృద్ధి నీ స్ఫూర్తి గా తీసుకొని ఈ వాక్ ను నిర్వహించడం జరిగిందని ఈ వాక్ సందర్భంగా పాత మున్సిపల్ భవనాన్ని అదే విధంగా సాలార్ జంగ్ మ్యూజియం గతంలో ఏ విధంగా ఉండే ప్రస్తుత ఏ విధంగా ఉందో ఫోటో ల ద్వారా చూడడం జరిగిందని హెరిటేజ్ నగరంలో ఉన్న ప్రాముఖ్యత పై ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పున:నిర్మాణ, పునరుద్ధరణ చేపట్టే ఆరు కమాన్ లు రాణీ గంజ్ కమాన్, షేక్ ఫెయిజ్ కమాన్, చట్ట బజార్ కమాన్, దీవాన్ దేవడి కమాన్, దబీర్పూర కమాన్, హుస్సేన్ అలం కమాన్లు అభివృద్ధి చేయనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ వాక్ లో జోనల్ కమిషనర్లు రవి కిరణ్, స్నేహ శబరిష్, అభిలాష అభినవ్, పంకజ, వెంకన్న, అడిషనల్ కమిషనర్ కె. శ్రీవాత్సవ్, చంద్రకాంత్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్, చీఫ్ ఎంటమాలజి ఆఫీసర్ డాక్టర్ పద్మజ, డాక్టర్ అబ్దుల్ వాకిల్, డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# స్థూలకాయానికి ఇలా చిటికెలో చెక్ పెట్టొచ్చు?




భారతీయ వంటగదిలో ఉన్న అనేక రకాల సుగంధ ద్రవ్యాలు రుచితో పాటు మంచి ఔషధ గుణాలకు కూడా ఎంతగానో ప్రసిద్ధి చెందాయి. లవంగం అనేది స్థూలకాయాన్ని తగ్గించే ముఖ్యమైన లక్షణాలను కలిగి ఉన్న ఆరోగ్యకరమైన మసాలా దినుసు. దీన్ని మన వంటల్లో ఉపయోగించి తింటే కలిగే లాభాల గురించి ఇప్పుడు మనం పూర్తిగా తెలుసుకుందాం.తక్కువ వేడి మీద ఆలివ్ నూనె లేదా నూనెలో లవంగాలను జోడించి వంట నూనె రుచిని మెరుగుపరచవచ్చు.. ఈ సుగంధ నూనెను వంట చేయడానికి ఉపయోగించవచ్చు..ఇది ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది.మీకు ఇష్టమైన స్మూతీ రెసిపీకి చిటికెడు లవంగం పొడిని జోడించి తాగడం వల్ల మీరు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుకునేందుకు, అతిగా తినడాన్ని నివారించవచ్చు. ఇంకా స్మూతీకి భిన్నమైన రుచిని పొందవచ్చు.ఇంట్లో తయారుచేసిన మసాలా మిశ్రమాలకు లవంగాలను జోడించి మీ ఆహారంలో ఈ మసాలాను యాడ్ చేసి లవంగాలు సూప్‌లు, కూరలు, స్టైర్-ఫ్రైస్ వంటి వంటకాలకు వెచ్చని రుచిని జోడించి తింటే చాలా ఆరోగ్యంగా ఉంటారు. లవంగాలను వేడి నీటిలో 5-10 నిమిషాలు ఉడకబెట్టడం ద్వారా లవంగం టీని సిద్ధం చేసుకోవచ్చు.. మీరు ఈ టీని రోజుకు ఒకసారి తాగవచ్చు. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, ఆకలిని అణిచివేస్తుంది.. ఇంకా జీవక్రియను పెంచుతుంది.లవంగం నీరు మీ శరీరంలోని కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. దీన్ని సిద్ధం చేయడానికి, కొన్ని లవంగాలను ఒక జగ్ నీటిలో వేసి రాత్రంతా అలాగే ఉంచండి. తర్వాత ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోండి.. ఇలా చేయడం వల్ల శరీరంలో మెటబాలిజం పెరుగుతుంది. దీని వల్ల కేలరీలు వేగంగా కరిగిపోతాయి.. బరువు తగ్గడం కూడా ప్రారంభమవుతుంది.బరువు తగ్గడానికి, వ్యాయామం మాత్రమే కాదు, భారతీయ వంటగదిలో ఉండే మసాలా దినుసు లవంగం వినియోగం కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుందని పేర్కొంటున్నారు.. లవంగం యాంటీ ఒబేసిటీలో సమృద్ధిగా ఉండే మసాలాలలో ఒకటి.. అందుకే ఆహారంలో చేర్చుకోవాలని సూచిస్తున్నారు.లవంగాల సారం తీసుకోవడం బరువు నియంత్రణలో, పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది.

# ఎర్ర రక్తకణాలు పెరగాలంటే



మన చుట్టూ పరిసరాలలో దొరికేటువంటి పండ్లలో జామ పండు కూడా ఒకటి. జామ పండ్లు తోనే కాకుండా జామ ఆకుల వల్ల కూడా మనకి చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. అలాగే ఈ ఆకులలో యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోటీన్, విటమిన్స్, క్యాల్షియం, మెగ్నీషియం ,ఫినాలేక్ సమ్మేళనాలు వంటివి కలిగి ఉండడమే కాకుండా విటమిన్లు, ఖనిజాలు వంటివి పుష్కలంగా లభిస్తాయి.. జామ ఆకులను నీటిలో మరిగించి తాగడం వల్ల మంచి ఉపయోగాలు ఉన్నాయి. అలాగే లేత ఆకులను కూడా నమలడం వల్ల పలు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. వాటి గురించి చూద్దాం. ఉదయం పూట లేవగానే ఖాళీ కడుపుతో జామ ఆకులను నమలడం వల్ల శరీరంలో ఉండే కొలెస్ట్రాళ్ కూడా తగ్గిపోతాయి. జామ ఆకుతో చేసేటువంటి డికాషన్ తాగడం వల్ల రక్తహీనత సమస్య కూడా తగ్గిపోతుంది.ముఖ్యంగా రక్తంలో ఉండేటువంటి ఎర్ర రక్త కణాలను సైతం పెంచేలా సహాయపడుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరగడం వల్ల తరచూ నోటిలో నాలుక పైన పుండ్లు లేదా బొబ్బలు వంటివి వస్తూ ఉంటాయి. జామ ఆకులతో చేసిన కషాయాన్ని తాగడం వల్ల వీటి నుంచి ఉపశమనాన్ని అందుకోవచ్చు. జామకాయలు జామ ఆకులు ఆరోగ్యానికే కాకుండా చర్మానికి కూడా చాలా మేలు చేస్తాయి. జామ ఆకులను కానీ.. రసాన్ని తాగడం వల్ల హానికరమైన పదార్థాలను కూడా తొలగించడానికి ఉపయోగపడుతుంది. అలాగే ముఖం పైన ఉండేటువంటి మొటిమలు మచ్చలను కూడా తగ్గించడానికి సహాయపడుతుంది. అధిక బరువుతో ఇబ్బంది పడుతున్న వారు బరువు తగ్గాలనుకునే వారికి ఈ జామ ఆకులు చాలా ఉపయోగపడతాయి. శరీరంలో ఉండే కొవ్వును కరిగించి శరీరంలో ఉండేటువంటి టాక్సీను కూడా తొలగిస్తుంది దీనివల్ల శరీరం ఫిటుగా మారుతుంది. మధుమేహ గ్రహస్తులకు జామ ఆకులు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఇందులో ఉండే ఫినాలేక్ కంటెంట్ రక్తంలో ఉండే చక్కెర స్థాయిలను కూడా తగ్గిస్తుంది దీనివల్ల మధుమేహం కూడా అదుపులో ఉంచేలా చేస్తుంది.

# ఆ అలవాట్లు చాలా డేంజర్..



అదేపనిగా ధూమ, మద్య పానం చేస్తే ఏమవుతుంది. దంతాలు ఊడిపోతాయి. చిగుళ్ళలో రక్తస్రావం జరుగుతుంది. అంతేకాదు గుండె, కాలేయం, మూత్రపిండాలు ప్రభావితమవుతాయి. చివరికి మరణం సంభవిస్తుంది. అయితే ఇవి మాత్రమే కాదట.. మద్యపానం, ధూమపానం వల్ల ఎటువంటి నష్టాలు జరుగుతాయో.. తెలుసుకునేందుకు ఏయిమ్స్ వైద్యులు ఒక అధ్యయనం చేశారు. ఇందులో పలు విస్మయకర వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మద్యపానం, ధూమపానం చేసేవారు ప్రాసెస్డ్ ఫుడ్ కు అలవాటు పడుతున్నారు. మద్యం తాగిన సమయంలో ఆ ఫుడ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. ధూమపాన సమయంలోనూ ప్రాసెస్డ్ ఫుడ్ ఇష్టానుసారంగా తింటున్నారు. అది శుక్రకణాల నాణ్యతను దెబ్బ తీస్తోంది. వంధ్యత్వం, గర్భస్రావం, పిల్లలు పుట్టుక లోపాలు వంటివి శుక్రకణాల్లో డీఎన్ఏ దెబ్బ తినడం వల్ల సంభవిస్తాయని ఎయిమ్స్ వైద్యులు చెబుతున్నారు.. ఒక స్త్రీ ఒక పురుషుడు వల్లే గర్భధారణకు గురవుతుంది. ఇలాంటి సమయంలో వీర్యంలో ఉన్న డీఎన్ఏ నాణ్యత ఆధారంగానే పిండం అభివృద్ధి జరుగుతుంది. అలాంటి సమయంలో గర్భానికి కారణమైన తండ్రి పాత్ర విస్మరించలేనిది. అలాంటప్పుడు ఆ తండ్రి వీర్యం నుంచి వచ్చే శుక్రకణం ఆరోగ్యంగా ఉండాలి. ముఖ్యంగా దానిపై ఉన్న డీఎన్ఏ చైతన్య శీలంగా ఉండాలి. మానసిక ఒత్తిడి, అనారోగ్య కరమైన జీవనశైలి వంటివి శుక్రకణాల నాణ్యత ప్రభావితం చేస్తాయి. శుక్రకణం నాణ్యత బాగుండాలంటే మద్యపానం చేయకూడదు. దూమపానం జోలికి పోకూడదు. అన్నింటికీ మించి రోజూ వ్యాయామం చేయాలి. యోగ సాధన చేయాలి. అప్పుడే మైటోకాండ్రియల్, న్యూక్లియర్ డీఎన్ఎల సమగ్రత పెరుగుతుంది. శుక్రకణంలో నాణ్యత మెరుగవుతుంది. అప్పుడు పుట్టే పిల్లలు కూడా ఆరోగ్యంగా ఉంటారు. పిండం అభివృద్ధి సక్రమంగా ఉంటుంది. పిండం వృద్ధి చెందుతున్న దశలలో అవయవాల క్రమం కూడా సక్రమంగా ఉంటుందని ఎయిమ్స్ వైద్యుల అధ్యయనంలో తేలింది.

# ఎండాకాలంలో మెంతికూర తినవచ్చా?



ఆకు కూరలు ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.. ప్రతి ఆకుకూరలో శరీరానికి కావలసిన పోషకాలు ఎక్కువగా ఉంటాయి.. ఈరోజు మనం మెంతి కూరను ఎండాకాలంలో తీసుకోవడం వల్ల ఎటువంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.. మెంతుకూర తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మెంతుకూర సూర్యుడు నుంచి కలిగే వడదెబ్బ నుంచి రక్షిస్తుంది కూడా. ఎండాకాలంలో డిహైడ్రేషన్ దరిచేరకుండా చేస్తుందని, అలాగే మధుమేహం కంట్రోల్ అవుతుందని చెబుతున్నారు.. ఈ ఆకులల్లో క్యాల్షియం, ఐరన్.. ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. ఎముకలు దృడంగా అవ్వడానికి ఇవి సహాయ పడతాయి.. ఇక అలాగే బరువు తగ్గాలని అనుకొనేవారు ఆకుకూరలను డైట్ లో తప్పకుండ చేర్చుకోవాలి.. ముఖ్యంగా మెంతుకూర ప్రతిరోజు తినడం ద్వారా మన బాడీలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ స్థాయిలను కరిగిస్తుంది. మెంతి చపాతీ లాంటివి చేసుకొని తినవచ్చు.. వడదెబ్బ తగలకుండా ఉంటుంది.. వేడిని తగ్గించడంలో సహాయ పడుతుంది.. జుట్టు సంరక్షణ లో మెంతి ఆకులు బాగా పనిచేస్తాయి.. ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు..

# వేసవిలో తాటి ముంజలు ప్రయోజనాలు



ఈ వేసవి చాలా హాట్‌గా ఉంది. మార్చి నుంచే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సీయస్‌కుపైగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం 45 డిగ్రీలకు చేరువలో ఉన్నాయి.రాబోయే రోజులు మరింత హాట్‌గా ఉంటాయని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా మంది వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మధ్యాహ్నం తర్వాత బయటకు రావడం లేదు. ఇంట్లోనే చల్లని పానీయాలు తాగుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. వేసవిలో శరీరానికి చలువ చేసే పండ్లు, ఆహారం తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. వేడిచేసే, తాపం పెంచే శీతల పానీయాలు, ఆహారం తీసుకోవడం వలన అనారోగ్యం బారిన పడతారని హెచ్చరిస్తున్నారు. దీంతో చాలా మంది వేసవిలో పుచ్చకాయలు, కొబ్బరి బోండాలతోపాటు మామిడి పండ్లు, తాటి ముంజలు ఎక్కువగా తీసుకుంటున్నారు. చిన్న పెద్ద అని తేడా లేకుండా అందరూ ఇష్టపడి తినేవి తాటి ముంజలు. ఇవి వేసవిలో మాత్రమే దొరుకుతాయి. దీంతో చాలా మంది వీటికోసం ఎదురు చూస్తున్నారు. ప్రకృతి నుంచి వీటిలో కల్తీ ఉండదు. స్వచ్ఛమైనవి. వేసవి తాపం నుంచి ఉపశమనానికి తాటి ముంజలు ఎంతో ఉపయోగపడతాయి. తాటి ముంజలు తినడం వలన శరీరానికి పలు రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగిస్తాయి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.తాటి ముంజల్లో విటమిన్స్, ఐరన్, కాల్షియం, జింక్, పాస్పరస్, పొటాషియం, థయామిన్, రోబో ఫ్లేవిన్, నియాసిన్, బీకాంప్లెక్స్ వంటివి ఉంటాయి. ఇవి అనారోగ్యం నుంచి కాపాడతాయి. తాటి ముంజల్లో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. వడదెబ్బ తగలకుండా ఇవి శరీరాన్ని చల్లబరుస్తాయి. అంతేకాకుండా డీహైడ్రేషన్ నుంచి కాపాడతాయి. ఇక తాటి ముంజలు రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. గుండె ఆరోగ్యానికి సహాయపడతాయి. తాటి ముంజలను ప్రతీ రోజు తీసుకోవడం వలన లివర్‌కు సంబంధించిన సమస్యలు తగ్గుతాయి. చెడు కొలెస్ట్రాల్ పోయి మంచిది వృద్ధి చెందుతుంది. తాటి ముంజల తీసుకోవడం వలన గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రొమ్ము క్యాన్సర్ నివారణలో తాటి ముంజలు కీలక పాత్ర పోషిస్తాయి. అధిక బరువు నుంచి ఉపశమనం కలిగిస్తాయి. తాటి ముంజలతో ఆరోగ్యం మెరుగవడమే కాకుండా అందం కూడా పెరుగుతుంది. వాటిని గుజ్జుగా చేసి ముఖానికి రాసుకుంటే చెమటకాయలను తగ్గిస్తాయి. చర్మాన్ని కాపాడుతాయి. మొటిమలు ఎక్కువగా ఉండేవారు తాటి ముంజల్లోని తెల్లని గుజ్జును ప్రతీరోజు ముఖానికి రాసుకుంటే సమస్య తగ్గుతుంది. మెరిసే అందం మీ సొంతమవుతుంది.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో – వాస్తవం పక్కా..



# స్థానిక వార్తలు

## అంబుజాలో అదానీకి మరింత వాటా ..




న్యూఢిల్లీ: తాజాగా రూ.8,339 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్‌తో అదానీ కుటుంబం అంబుజా సిమెంట్స్‌లో వాటాను 70.3శాతానికి పెంచుకుంది. బిలియనీర్ గౌతమ్ అదానీ, ఆయన కుటుంబం అంబుజా సిమెంట్స్‌లో అదనంగా రూ.8,339 కోట్లను పెట్టుబడి పెట్టినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది, అక్టోబర్ 18, 2022న రూ.5,000 కోట్లు, మార్చి 28, 2024న రూ.6,661 కోట్ల ఇన్వెస్ట్‌మెంట్స్ తర్వాత తాజా పెట్టుబడి వచ్చింది.అదానీ కుటుంబం మొత్తం రూ.20 వేల కోట్లను మదుపు చేయడం ద్వారా కంపెనీలోని వారెంట్ల ప్రోగ్రామ్‌కు పూర్తిగా సభ్యత్వాన్ని పొందిందని అంబుజా సిమెంట్స్ లిమిటెడ్ హోల్ టైమ్ డైరెక్టర్, సీఈఓ అజయ్ కపూర్ అన్నారు. 2028 ఆర్థిక సంవత్సరం నాటికి భారతీయ సిమెంట్ మార్కెట్‌లో వాటాను దాదాపు ఐదవ వంతుకు పెంచుకుంటామని అదానీ ఇదివరకే ప్రకటించింది. 2022లో గ్లోబల్ బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకొని అదానీ అంబుజా సిమెంట్స్ లిమిటెడ్, ఏసీసీ లిమిటెడ్‌లో నియంత్రణ వాటాను 10.5 బిలియన్? డాలర్లకు కొనుగోలు చేసింది. యూఎస్?–ఆధారిత షార్ట్–సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ చేసిన తీవ్ర దాడినుంచి కోలుకున్న తర్వాత బార్?క్లేస్?, బ్యాంక్ , డాయిష్?బ్యాక్?, స్టాండర్డ్ చార్టర్డ్ లోన్లను గత సంవత్సరం రీఫైనాన్స్ చేసింది.

## భారత వృద్ధి 6.5 శాతం



భారత ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది 6.5 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. దేశంలో పలు బహుళజాతి కంపెనీలు తమ తయారీని కొనసాగిస్తుండడం వల్ల, భారత ఎగుమతులపై సానుకూల ప్రభావం పడుతోందని పేర్కొంది.2024లో 6.8%, 2025లో 6.5% మేర భారత్ వృద్ధి నమోదు చేస్తుందని మంగళవారం విడుదలైన ఐఎమ్ఎఫ్ నివేదిక అంచనా వేసింది. ఐక్యరాజ్యసమితి ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్(యూఎన్‌సీటీఏడీ) విడుదల చేసిన నివేదిక ప్రకారం..2023లో భారత్ 6.7% వృద్ధిని నమోదు చేసింది. 2024లో అది 6.5% వృద్ధిని నమోదు చేయొచ్చు. తద్వారా ప్రపంచంలో అత్యంత వేగవంత వృద్ధి గల ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగగలదు.2023లో బలమైన ప్రభుత్వ పెట్టుబడుల కేటాయింపులకు తోడు సేవల రంగం రాణించింది. వినియోగదార్లకు స్థానికంగా బలమైన గిరాకీ లభించడం, వ్యాపార సేవల ఎగుమతులకు బయటి దేశాల నుంచి గిరాకీ కొనసాగడంతో మంచి వృద్ధి సాధ్యమైంది. ఈ అంశాలు 2024లోనూ మద్దతుగా నిలిచి, వృద్ధి కారకాలుగా నిలవగలవు.స్వల్పకాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను స్థిరంగానే ఉంచొచ్చని నివేదిక అంచనా వేసింది. ప్రభుత్వ పెట్టుబడుల వ్యయాలు భారీగా కనిపించొచ్చు.ఇతర దక్షిణాసియా దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంకలలో వృద్ధి అత్యంత స్తబ్దుగా ఉండొచ్చు. వరుసగా మూడో ఏడాదీ 'అంతర్జాతీయం' వెనకడుగే: అంతర్జాతీయ వృద్ధి 2024లో 2.6 శాతంగా నమోదవ్వొచ్చు. 2023 నాటి 2.7 శాతంతో పోలిస్తే ఇది కాస్తంత తక్కువ. కరోనాకు ముందు అంటే 2015–19 సంవత్సరాల్లో సగటు వృద్ధి రేటు 3.2% నమోదైంది. దీంతో వరుసగా మూడో ఏడాదీ అంత కంటే తక్కువ వృద్ధి నమోదుకానుంది.

# సెకండ్ హ్యాండ్ కార్లలో వీటికి డిమాండ్ ఎక్కువ

కారులో తిరగాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ అనుగుణమైన బడ్జెట్ అందరికీ ఉండదు. ఈ తరుణంలో సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు చేసి తమ కోరికను నెరవేర్చుకుంటారు.ఈ నేపథ్యంలో మార్కెట్లో యూజ్డ్ కార్లకు బాగా డిమాండ్ పెరిగిపోతుంది. సెకండ్ హ్యాండ్ కార్లైనా ఎస్ యూవీలంటే తెగ లైక్ చేస్తున్నారు. వీటిలో ఉండే సౌకర్యాలతో పాటు విశాలమైన స్పేస్ కలిగి ఉండడంతో ఎస్ యూవీ కార్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. మరి ఎస్ యూవీల్లో ఏ కార్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారంటే? హ్యాచ్ బ్యాక్ కార్ల కంటే ఎస్ యూవీల్లో ఉండే స్పెషిఫికేషన్స్, ఇంజిన్ తదితరు సౌకర్యాలు మెరుగ్గా ఉంటాయి. అయితే కొత్త కారు కొనాలంటే మాత్రం కాస్త బడ్జెట్ ఉండాలి. అయితే ఇదే ఎస్ యూవీ లో ప్రయాణించాలని అనుకుంటే మాత్రం సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు ఎంజాయ్ చేయొచ్చు. సెకండ్ హ్యాండ్ కార్లలో హ్యుందాయ్ క్రెటా, ఫోర్డ్ ఎకో స్పోర్ట్ వాటిపై ఎక్కువగా మనసు పెడుతున్నారు. వీటిలో ఉండే ఫీచర్స్ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. హ్యుందాయ్ క్రెటాలో 1.5 లీటర్ 4 సిలిండర్ పెట్రోల్, 1.5 లీటర్ 4 సిలిండర్ డీజిల్ అనే రెండు ఇంజిన్లు ఉంటాయి. లీటర్ పెట్రోల్ కు 17.21 కిలోమీటర్ల వరకు మైలేజ్ ఇస్తుంది. ఇది ఓవరాల్ గా 115 బీహెచ్ పీ పవర్ తో పాటు 250 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. ఇందులో ఎల్ ఈడీ హెడ్ ల్యాంపులు, ఎల్ ఈడీ డీఆర్ఎల్ లు, ఎల్ ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఎల్ ఈడీ కార్నరింగ్ ల్యాంప్స్, 8 ఇంచెస్ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ మోడల్



కొత్త కారు రూ.11 లక్షల ప్రారంభ ధరతో విక్రయించనున్నారు. ఫోర్డ్ ఎకో స్పోర్ట్స్ 1.5 3 సిలిండర్ పెట్రోల్, 1.5 లీటర్ 4 సిలిండర్ డీజిల్ ఇంజిన్లు కలిగి ఉంది. ఇందులో 99.23 బీహెచ్ పీ పవర్ తో పాటు 215 ఎన్ ఎం టార్క్ ను ఉత్పత్తి చేస్తుంది. లీటర్ పెట్రోల్ కు 14.7 నుంచి 21.7 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఈ కొత్త కారు రూ.8.19 లక్షల ప్రారంభ ధర నుంచి విక్రయిస్తున్నారు. సెకండ్ హ్యాండ్ ఎకో స్పోర్ట్ కారు కు విపరీతమైన డిమాండ్ పెరుగుతోంది ఆకర్షణీయమైన డిజైన్ తో పాటు తక్కువ ధరకు లభించడంతో దీనిపై మక్కువ చూపుతున్నారు. సెకండ్ హ్యాండ్ కార్లలో హ్యుందాయ్ క్రెటా, ఫోర్డ్ ఎకో స్పోర్ట్ కార్లు ఆధిపత్యం చూపిస్తున్నాయి. వీటి తరువాత స్విఫ్ట్, బ్రెజా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో సెకండ్ హ్యాండ్ వెహికల్స్ 30 శాతం వృద్ధిని సాధించాయి. భారత్ లో కొచ్చి, జైపూర్, లక్నో వంటి నగరాల్లో యూజ్డ్ కార్లకు డిమాండ్ పెరుగుతున్నట్లు నివేదికలు ఉన్నాయి.

# ఉద్యోగులు ఎక్కువగా లైక్ చేసే కంపెనీలు ఇవే..

చాలా మందికి ఉద్యోగం చేయడం అంటే ఇష్టం. అదీ పెద్ద కంపెనీల్లో జాబ్ చేయడం అంటే హుందాగా ఫీలవుతారు. అయితే కొన్ని కంపెనీలు పేరుకు కార్పొరేట్ అయి ఉండి, భారీ జీతం, అనువైన సౌకర్యాలు ఉన్నా.. మనశ్శాంతి ఉండదు. ఏదో తెలియని బాధ ఉంటుంది. ఈ నేపథ్యంలో నెట్ వర్కింగ్ ప్లాట్ ఫాం 'లింక్డ్ ఇన్' తాజాగా జరిపిన అధ్యయనాల్లో కొన్ని కంపెనీలు ది బెస్ట్ గా నిలిచాయి. ఇందులో పనిచేయానికి ఉద్యోగులు ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపుతున్నారని తెలిపింది. ఇందులో ఎక్కువగా ఆర్థిక సేవలు నిర్వహించే కంపెనీలే ఉండడం విశేషం. మరి ఆ వివరాల్లోకి వెళితే.. లింక్డ్ సంస్థ '2024 టాప్ కంపెనీస్' నివేదికను ఏప్రిల్ 16న బయట పెట్టింది. దీని ప్రకారం.. ఉద్యోగులు పనిచేయడానికి అనువైన కంపెనీల్లో మొదటి స్థానంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ మొదటి స్థానంలో నిలిచింది. ఇందులో పనిచేయడానికి ఉద్యోగులు ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపుతున్నట్లు పేర్కొంది. ఆ తరువాత యాక్సంచర్, కాగ్నిజెంట్ రెండు, మూడు స్థానాలు సంపాదించుకున్నాయి. ఇక ఇందులో అగ్రగామిగా 25 సంస్థలు, మధ్యస్థాయిగా 15 ఉన్నాయి. లింక్డ్ సంస్థ బయటపెట్టిన నివేదికలోని టాప్ 25 కంపెనీల్లో 9 సంస్థలు ఆర్థిక సేవలు నిర్వహించేవే ఉన్నాయి. ఇందులో మెక్వారీ గ్రూప్, మోర్గాన్ స్టాన్లీ, జేపీ మోర్గాన్ చేస్ అండ్ కో ఉన్నాయి. వీటితో పాటు ఫ్యాషన్, బ్యూటీ, రిటైలర్ సంస్థ నైకా, పాంటసీ స్పోర్ట్స్ ఫ్లాఫాం, డ్రీమ్ 11 కూడా ఉన్నాయి. సాఫ్ట్ వేర్ యూజ్ ఏ సర్వీస్, ప్లాట్ ఫాం లెంట్రా మధ్య స్థాయి కంపెనీ జాబితాలో ఉంది. చాలా కంపెనీలు నైపుణ్యం కలిగిన ఉద్యోగులను కోరుకుంటున్నాయి. ముఖ్యంగా ఆర్థిక సేవల రంగంలోని కంపెనీలు ఇన్వెస్టర్స్ రిలేషన్స్, క్యాపిటల్ మార్కెట్స్, ఇన్వెస్ట్ మెంట్ బ్యాంకింగ్ వంటి వారికి ప్రాధాన్యత




ఇస్తున్నాయి. ఇక టెక్ కంపెనీలు ఏఐ నైపుణ్యాల కోసం అన్వేసిస్తున్నాయి. డేటా స్టోరేజ్ టెక్నాలజీ, సాఫ్ట్ వేర్ డెవలప్ మెంట్ లైఫ్ సైకిల్ రంగంలోని వారిని నియమించుకుంటున్నాయి.

# స్పోర్ట్స్

## పీల్చి పిప్పిచేయాలని చూస్తున్నారు.. మా భయం అదే!

ఐపీఎల్ ఫ్రాంఛైజీ చెన్నై సూపర్ కింగ్స్ గురించి బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఆపరేషన్స్ చైర్మన్ జలాల్ యూనస్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముస్తాఫిజుర్ రహ్మాన్ సేవలను వందకు వంద శాతం ఉపయోగించుకోవాలని సీఎస్కే భావిస్తోందని.. దాని వల్ల తాము నష్టపోయే పరిస్థితి వస్తుందన్నాడు. అదే విధంగా.. ఇప్పటికే ముస్తాఫిజుర్ తానేంటో అంతర్జాతీయ స్థాయిలో నిరూపించుకున్నాడని.. అతడు కొత్త ఐపీఎల్‌లో కొత్త నేర్చుకునేది ఏమీ లేదని యూసన్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. కాగా ఐపీఎల్–2024 మినీ వేలంలో భాగంగా సీఎస్కే రూ. 2 కోట్ల కనీస ధరకు బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్‌ను కొనుగోలు చేసింది.

ఫ్రాంఛైజీ తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తూ ముస్తాఫిజుర్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటి వరకు ఆడిన ఐదు మ్యాచ్‌లలో కలిపి 10 వికెట్లు తీశాడు. చెన్నై విజయాల్లో తన వంతు పాత్ర పోషిస్తున్నాడు. ఇదిలా ఉంటే.. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ముస్తాఫిజుర్ రహ్మాన్‌కు కేవలం మే 1 వరకే ఐపీఎల్‌లో ఆడేలా నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం(నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్) జారీ చేసింది. జింబాబ్వేతో సిరీస్ నాటికి తిరిగి రావాలని నిబంధన విధించింది. అయితే, సీఎస్కే మాత్రం ఒకరోజు గడువు పొడిగించాలని విజ?ప్తి చేసింది. మే 1న పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ అనంతరం అతడిని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు బీసీబీకి ప్రతిపాదనలు పంపింది. ఇందుకు బీసీబీ అంగీకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో యూనస్ బంగ్లా మీడియా 'డైలీ స్టార్'తో మాట్లాడుతూ.. "మే 1 వరకు ముస్తాఫిజుర్ ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతించాం. అతడు మే 2న తిరిగి వస్తాడు. ఆ మరుసటి రోజు నుంచి అతడు బంగ్లా జట్టుకు అందుబాటులో ఉంటాడు. అయినా.. ముస్తాఫిజుర్ ఐపీఎల్‌లో ఆడటం ద్వారా కొత్తగా నేర్చుకునేది ఏమీ ఉండదు. అతడు నేర్చుకునే



దశ పూర్తైంది. నిజానికి చాలా మంది అతడిని చూసే నేర్చుకుంటున్నారు. ఐపీఎల్‌లో ఆడించడం ద్వారా బంగ్లాదేశ్‌కు ఒరిగేదేమీ లేదు. మా ఆందోళనంతా ముస్తాఫిజుర్ ఫిట్‌నెస్ గురించే! వాళ్లు అతడి నుంచి 100 శాతం ఎఫర్ట్ రాబట్టాలని చూస్తున్నారు. అతడి ఫిట్‌నెస్ గురించి వాళ్లకెందుకు పట్టింపు ఉంటుంది. మాకు మాత్రం అతడు ముఖ్యం. అందుకే తనని వెనక్కి రప్పిస్తున్నాం. కేవలం జింబాబ్వేతో సిరీస్‌లో ఆడేందుకే కాదు.. అతడిపై పనిభారం తగ్గించేందుకు కూడా ఈ నిర్ణయం తీసుకున్నాం" అని చెప్పుకొచ్చాడు. కాగా యూనస్ వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్‌లో తమ ఆటగాడిని వాడుకుంటున్నారని బాధపడే బదులు అతడిని మొత్తానికే పంపకుండా ఉండే బాగుండేదని యూనస్‌కు చురకలు అంటిస్తున్నారు సీఎస్కే ఫ్యాన్స్. ఫ్రాంఛైజీ క్రికెట్‌లో డబ్బు కోసమే అందరూ ఆడతారని.. అలాంటపుడు వేలంలోకి రాకుండా ముస్తాఫిజుర్‌ను ఆపాల్సిందని కామెంట్లు చేస్తున్నారు.? కాగా మే 3 – 12 వరకు బంగ్లాదేశ్ స్వదేశంలో జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో తలపడనుంది.

## నన్ను నవ్వించగలిగేది అతనే..

## అప్పుడు చాలా బాధ పడ్డాను: రోహిత్ శర్మ



క్లబ్ ప్రియారీ ఫైర్ అనే పోడ్‌కాస్ట్‌తో మాట్లాడుతూ టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చాలా ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు. ఐపీఎల్ 2024తో బిజీగా ఉన్న హిట్‌మ్యాన్ ఖాళీ సమయంలో క్లబ్ ప్రియారీతో మాట్లాడుతూ.. ధోని, దినేశ్ కార్తీక్, రిషబ్ పంత్ గురించి ఎన్నో విషయాలు పంచుకున్నాడు.

నన్ను నవ్వించగలిగేది అతనే..

పంత్ గురించి మాట్లాడుతూ.. టీమిండియాలో నన్ను ఎవరైనా నవ్వించగలరంటే అది పంత్ మాత్రమే. అతన్ని నేను చిన్నప్పటి నుంచి చూస్తున్నాడు. చాలా సరదాగా, ఉత్సాహంగా ఉంటాడు. నాకు నవ్వుకోవాలని అనిపించిన ప్రతిసారి అతనితో మాట్లాడతాను. ఏదో ఒకటి చెప్పి నవ్వించేస్తాడు. వికెట్ల వెనక పంత్ చేసే కామెడీ అంతా ఇంతా కాదు. అందరూ పగలబడి నవ్వుతారు. అయితే కారు ప్రమాదం కారణంగా పంత్ అమూల్యమైన కెరీర్‌ను మిస్ కావడం నన్ను చాలా బాధించింది. ఇప్పటికైనా అతను బెస్ట్ అంటూ హిట్‌మ్యాన్ కితాబునిచ్చాడు.

**ధోనిని ఒప్పించడం చాలా కష్టం.. డీకే అయితే ఈజీ**

టీ20 వరల్డ్‌కప్ 2024 కోసం చాలా మంది రిటైర్డ్ క్రికెటర్లు (పాకిస్తాన్) తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారనే అంశంపై మాట్లాడుతూ.. రిటైర్మెంట్ వెనక్కు తీసుకోమని ధోనిని ఒప్పించడం చాలా కష్టం. ఎందుకంటే అతను బాగా అలసిపోయి ఉన్నాడు. ఇలాంటి సందర్భంలో అతన్ని రిటైర్మెంట్ వెనక్కు తీసుకుని వరల్డ్‌కప్ ఆడమని అడగలేం. అడిగినా అతను ఒప్పుకోడు. ఇదే విషయంలో దినేశ్ కార్తీక్‌ను ఒప్పించడమయితే చాలా సులువే అని హిట్‌మ్యాన్ అన్నాడు.

ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో ధోని, దినేశ్ కార్తీక్ ఇద్దరు చాలా బాగా ఆడుతున్నారని రోహిత్ కితాబునిచ్చాడు. ఆర్సీబీతో మ్యాచ్ సందర్భంగా రోహిత్ డీకేను సరదాగా ఆటపట్టించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కార్తీక్ హిట్టింగ్ చేస్తుండగా రోహిత్ సరదాగా చేసిన కామెంట్స్ వైరలయ్యాయి. శభాష్ డీకే.. టీ20 వరల్డ్‌కప్‌కు సెలెక్ట్ కావాలని అడుతున్నట్లుంది. నీ మైండ్‌లో కూడా ఇదే నడుస్తున్నట్లుందని రోహిత్ డీకేను ఆటపట్టించాడు.

**ధోనిలో ఆ పాత ఉత్సాహం ఇంకా ఉంది..**

ఇదే సందర్భంగా రోహిత్.. ధోని ముంబైతో ఆడిన ఇన్నింగ్స్‌పై (4 బంతుల్లో 20 నాటౌట్) కూడా ప్రశంసల వర్షం కురిపించాడు. ధోనిలో ఆ పాత ఉత్సాహం ఇంకా ఉంది. నాలుగు బంతులు ఆడి అతను మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. అతన్ని ఇన్నింగ్స్ తమ ఓటమిని శాశించింది. ధోని చేసిన 20 పరుగులే తమకు వారికి వ్యత్యాసం అంటూ గుర్తు చేసుకున్నాడు.

## కేకేఆర్‌తో మ్యాచ్‌కు డౌటే

**కోల్‌కతా:** తుంటి నొప్పితో బాధపడుతున్నట్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తెలిపాడు. ఇప్పటికే ఈ టోర్నీలో పెద్దగా ప్రభావం చూపలేకపోయిన ఆ స్టార్ క్రికెటర్ ప్రస్తుతం కఠిన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నాడు. ఇక ఆదివారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరగనున్న మ్యాచ్‌కు కూడా అతను ఆడేది డౌట్‌గానే ఉన్నది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు ఆరు మ్యాచ్‌లు ఆడిన గ్లెన్ మ్యాక్స్‌వెల్ 5.33 యావరేజ్‌తో మొత్తం 32 రన్స్ చేశాడు. సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ ఆడలేదు. శారీరక, మానసిక వత్తిడి వల్ల సరిగా ఆడలేకపోయినట్లు మ్యాక్సీ తెలిపాడు. ఇటీవల తుంటి నొప్పి మొదలైందని, రికవరీ కోసం కొన్ని రోజులు పడుతుందని అతను వెల్లడించాడు.





# చీరకట్టులో నేహా శట్టి!

డీజే టిల్లు సినిమాతో ఫామ్ లోకి వచ్చిన నేహా శెట్టి కి ఇప్పుడున్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ విశ్వక్సేన్ హీరోగా నటిస్తున్న గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాతో త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సిద్ధూ జొన్నలగడ్డ తో కలిసి చేసిన డీజే టిల్లు సినిమాలో వీరిద్దరి కెమిస్ట్రీ గురించి ఎంత చెప్పినా తక్కువే. అలా వీరిద్దరి కెమిస్ట్రీ బాగా పండడంతో యువత అంతా ఈ బ్యూటీ కి ఫ్యాన్స్ అయిపోయారు. ఈ సినిమా ఊహించని స్థాయిలో సక్సెస్ అవ్వడంతో ఈ ముద్దుగుమ్మకు సైతం వరుస సినిమాల్లో నటించే అవకాశం వచ్చింది. అలా నేహా శెట్టి చివరగా నటించిన సినిమా రూల్స్ రంజన్. కిరణ్ అబ్బవరం నటించిన ఈ సినిమా సైతం పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. దాంతోపాటు కార్తికేయకి జోడిగా కూడా బెదురు లంక 2012 సినిమాలో సైతం నటించిన ఈమె ఇప్పుడు విశ్వక్సేన్ కి జోడి గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమాలో నటిస్తోంది ఈ బ్యూటీ. అయితే ఇటీవల టిల్లు స్క్వేర్ సినిమాలో సైతం కీలక పాత్రలో నటించిన ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మరింత పెరిగిపోయింది. ఇక ఈ సినిమాలో స్నేహ క్యమియో రోల్ లో కనిపించింది. దీంతో మరొకసారి సోషల్ మీడియాలో ఇప్పుడు రాధిక అన్న పేరు ట్రెండింగ్ లో ఉంది. రాధిక అక్క అంటూ ఈ ముద్దుగుమ్మని పిలుస్తూ ఉంటారు ఆమె అభిమానులు. టిల్లు స్క్వేర్ చిత్రంలో కథకి ఆమె పాత్రని బాగానే లింక్ చేశారు. ఈ చిత్రం చూస్తేనే ఆమె ఎలాంటి కామియో రోల్ చేసిందో అర్థం అవుతుంది. ఇటీవల జరిగిన టిల్లు స్క్వేర్ చిత్ర సక్సెస్ మీట్ లో కూడా నేహా శెట్టి మెరిసింది. నేహా శెట్టి ఎక్కడ కనిపించినా గ్లామర్ తో హైలైట్ అవుతోంది. తాజాగా నేహా శెట్టి ఆకర్షించే చీరలో మెరిసింది. గ్రీన్ డిజైనర్ శారీలో నేహా శెట్టి ఎంతో వయ్యారంగా ఫోజులు ఇచ్చింది. నేహా శెట్టి బ్యూటిఫుల్ లుక్ కి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.



# ప్రభాస్‌పై హీరోయిన్ అలాంటి పోస్ట్.. లైట్ తీస్కోమన్న ప్రియదర్శి!

టాలీవుడ్‌లో గ్లామర్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నభా నటేశ్. ఆమె ప్రస్తుతం నిఖిల్ సరసన స్వయంభూ చిత్రంలో నటిస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సంయుక్త ఓ కథానాయికగా నటిస్తుండగా.. నభా నటేష్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ పాన్ ఇండియా మూవీని నిర్మిస్తున్నారు. అయితే తాజాగా నభా నటేశ్ చేసిన ఓ ట్వీట్ సోషల్ మీడియాలో వైరలవుతోంది. ప్రభాస్ డార్లింగ్ అంటూ చెప్పే డైలాగులతో ఓ వీడియోను పంచుకుంది. ఇది చూసిన ప్రియదర్శి పులికొండ.. వావ్ సూపర్ డార్లింగ్.. కిరాక్ ఉన్నావ్ డార్లింగ్.. అంటూ కామెంట్స్ చేశారు. అయితే ప్రియదర్శి చేసిన కామెంట్స్‌పై నభా నటేశ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మిస్టర్.. ఒకరిని కామెంట్ చేసేముందు మాటలు జాగ్రత్త, హద్దులు దాటొద్దు.. అంటూ మండిపడింది. అలాగే పరిచయం లేని మహిళలను డార్లింగ్ అని పిలిస్తే లైంగిక వేధింపులకు కిందకే వస్తుందని గతంలో కోల్‌కతా హైకోర్టు తీర్పునిచ్చిందంటూ దానికి సంబంధించిన వార్త క్లిప్‌ను నభా నటేశ్ షేర్ చేసింది. ఇది చూసిన ప్రియదర్శి సైతం అదిరిపోయే రిప్లై ఇచ్చాడు. మీరేమో డార్లింగ్ అని పిలవొచ్చు.. మేము పిలిస్తే ఐపీసీ సెక్షన్ పెడతారా? లైట్ తీస్కో డార్లింగ్ అంటూ పోస్ట్ చేశారు. ఇదంతా కేవలం ఫన్నీ కోసమే చేసినట్లు తెలుస్తోంది. ఏదేమైనా ప్రస్తుతం ఈ వీరిద్దరి మధ్య సంభాషణ మాత్రం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. కాగా.. ప్రియదర్శి ఇటీవల సేవ్ ది టైగర్స్-2 సీజన్‌తో ప్రేక్షకులను అలరించారు.

# మిరాయ్‌గా వస్తున్న హనుమాన్ హీరో




'హను-మాన్' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్నాడు టాలీవుడ్ యువకథానాయకుడు తేజ సజ్జా. ఇక ఈ సినిమా అనంతరం అతడికి వరుస ఆఫర్స్ వస్తున్న విషయం తెలిసిందే. ఇక తేజ తర్వాతి సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో ఎట్టకేలకు అతని తాజా సినిమా ప్రకటన వెలువడింది. ఈగల్ దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమా వస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో తేజ సూపర్‌యోధగా కనిపించనున్నాడు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన టైటిల్‌తో పాటు గ్లింప్స్‌ను మేకర్స్ రివీల్ చేశారు. ఈ సినిమాకు మిరాయ్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇక మిరాయ్ అంటే ఫ్యూచర్ అని అర్థం. మౌర్య సామ్రాజ్యపు రాజైన అశోకుడు కళింగ యుద్ధం అనంతరం పశ్చాతాపంతో యోగిగా మారతాడు. అయితే అశోకుడిని యోగిగా మార్చిన ఓ అపార గ్రంథం ప్రస్తుతం ఆపదలో ఉంటుంది. తొమ్మిది గొప్ప గ్రంథాలతో సిద్ధం చేసిన ఆ అపార గ్రంథాన్ని దక్కించుకోవడం కోసం కొందరు దుండగులు ప్రయత్నిస్తుంటారు. అయితే ఈ గ్రంథాలను కాపాడడం కోసం ఒక యోధుడు ఉంటాడు. ఆ యోధుడే తేజ సజ్జా. ప్రస్తుతం ఈ గ్లింప్స్ నెట్టింట దూసుకుపోతుంది. ఇందులో తేజ సజ్జా స్టైలిష్ మేక్ ఓవర్‌తో సూపర్‌యోధగా కనిపిస్తున్నాడు. ఇక భారీ బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నాడు. ఈ చిత్రానికి రచన: మణిబాబు కరణం, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.

# టాలీవుడ్ నుంచి మరో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజా రవీంద్ర ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'సారంగదరియా'. ఈ సినిమాతో పద్మారావు అబ్బిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సైజా క్రియేషన్స్‌పై ఉమాదేవి, శరత్‌చంద్ర నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. అయితే ప్రమేషన్స్‌లో భాగంగా ఇప్పటికే సినిమా నుంచి 'అందుకోవా..' అంటూ సాగే పాటను విడుదల చేయగా యూత్‌ను ఆకట్టుకుంటుంది. ఇప్పుడు తాజాగా హీరో శ్రీవిష్ణు చేతుల మీదుగా మేకర్స్ టీజర్ విడుదల చేయించారు. మధ్యతరగతి కుటుంబంలో జరిగే చిన్ని చిన్ని ఎమోషన్స్, గొడవలు, ప్రేమ, కుటుంబ భావోద్వేగాలు ఇలా అన్ని ఎలిమెంట్స్ కలిపితే ఎలా ఉంటుందో ఈ టీజర్ అలా సాగింది. రాజా రవీంద్ర చాలా రోజుల తర్వాత ఈ సినిమాలో తండ్రి పాత్రలో కొత్తగా కనిపిస్తున్నాడు. శ్రీకాంత్ అయ్యంగార్, శివ చందు, యశస్విని, మొయిన్, మోహిత్, నీల ప్రియా, కాదంబరి కిరణ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎం.ఎబెనెజర్ పాల్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి మాటలు: వినయ్ కొట్టి, కెమెరా: సిద్ధార్థ స్వయంభు.

# ప్రభాస్ లేటెస్ట్ లుక్ వైరల్



టాలీవుడ్ యంగ్ రెబల్ స్టార్ ప్రస్తుతం కల్కి 2898 ఏడీ మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కించిన ఈ మూవీ త్వరలోనే థియేటర్లలో సందడి చేయనుంది. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్ కనిపిస్తున్నారని చిత్రి యూనిట్ ఇప్పటికే ప్రకటించింది. కానీ పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. ఆ సమయంలో ఎన్నికల కారణంగా ఈ సినిమా వాయిదా పడే అవకాశం ఉందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ప్రభాస్ మరో చిత్రంలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. మారుతి డైరెక్షన్‌లో ది రాజాసాబ్ మూవీ చేస్తున్నారు. తాజాగా ప్రభాస్‌కు ది రాజాసాబ్ సెట్స్‌లో అడుగుపెట్టారు. సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. ప్రభాస్ సరికొత్త హెయిర్ కట్ లుక్‌లో కనిపించారు. ఇది చూసిన అభిమానులు రెబల్ స్టార్‌పై క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ప్రబాస్ మిర్చి సినిమాలో లాగా స్టైలిష్‌గా ఉన్నారంటూ పోస్టులు పెడుతున్నారు. లాంగ్ హెయిర్, గడ్డంతో సరికొత్త వింటేజ్ లుక్‌లో ప్రభాస్ సందడి చేశారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vnteluguldaily@gmail.com, vaasthavanestham.com